

APTEL/26/A2902

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక



సంపుటి : 01 | సంచిక : 66 | 27 - 10 - 2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : 09 /-

Published In Srikakulam , Vijayanagaram , Vishakapatnam, Araku , Anakapalli , Kakinada , Narasapuram, Amalapuram, Rajamundry, Eluru , Machilipatnam , Vijayawada

బ్రిక్స్ దేశాల ఎంపీలతో చర్చలు అద్భుతం : మోదీ



న్యూఢిల్లీ , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో కీలక సమావేశానికి ఆతిథ్యమిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ 2026 సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ వివిధ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాలకు చెందిన ఎంపీలతో సమావేశమయ్యారు. వారితో జరిగిన చర్చలు అద్భుతంగా సాగాయని మోదీ తెలిపారు. పలు అంతర్జాతీయ అంశాలపై తమ అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నట్లు వెల్లడించారు. ఢిల్లీలోని పార్లమెంట్ ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఈ ఫోరమ్ జరుగుతోంది. బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల నుంచి పార్లమెంటరీ ప్రతినిధులు ఇందులో పాల్గొంటున్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటం, ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించడం, పార్లమెంటరీ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం ఈ సమావేశాల ప్రధాన లక్ష్యాలు. ప్రపంచ దేశాల మధ్య సహకారాన్ని పెంచుకోవడంతో పాటు, ఆయా దేశాల శాసనసభలు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను పరస్పరం తెలుసుకునేందుకు ఈ వేదిక ఉపయోగపడనుంది.

ఏఐ, డిజిటల్ టెక్నాలజీపైనా చర్చలు

ఈ రెండు రోజుల సదస్సులో నాలుగు ప్రధాన అంశాలపై ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్థిరత్వం, నూతన ఆవిష్కరణలు, పరస్పర సహకారం, సుస్థిరత ప్రధాన చర్చాంశాలుగా ఉన్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అభివృద్ధి చెందుతున్న డిజిటల్ సాంకేతికతలపై చట్టసభలు ఎలాంటి పర్యవేక్షణ చేయాలి? సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు ఉపయోగపడేలా ఎలా వినియోగించాలి? వంటి అంశాలపై చర్చించనున్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో పార్లమెంట్ల పాత్రపైనా దృష్టి సారించనున్నారు.

విదేశీ ప్రతినిధులకు మోదీ స్వాగతం

సోమవారం ఫోరమ్ ప్రారంభ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. భారత్‌కు వచ్చిన బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాల ప్రతినిధులకు స్వాగతం పలికారు. అనంతరం ఆయా దేశాల పార్లమెంటరీ ప్రతినిధి బృందాల అధిపతులు, స్పీకర్లతో సమావేశమయ్యారు. ఉగాండా, క్యూబా, బ్రెజిల్, రష్యా తదితర దేశాల ప్రతినిధులు పార్లమెంట్ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ ఫోరమ్‌లో పాల్గొనేందుకు 11 బ్రిక్స్ సభ్య దేశాలు, 10 భాగస్వామ్య దేశాలకు చెందిన పార్లమెంటరీ బృందాలు ఢిల్లీకి వచ్చాయి.


8లో

విజయవాడకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

ఘన స్వాగతం పలికిన గవర్నర్, మంత్రి లోకేశ్

విజయవాడ , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సోమవారం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు విచ్చేశారు. ఆయన ప్రత్యేక విమానంలో విజయవాడ సమీపంలోని గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఘనంగా స్వాగతం పలికింది. ఉపరాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో పాటు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.


8లో

ఆ ఒక్క పని చేయండి 30 సెకన్లలో నిరసన ఆపేస్తాం : రాహుల్

న్యూఢిల్లీ , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగిస్తే, తాము తలపెట్టిన ఆందోళనను 30 సెకన్లలోనే విరమించుకుంటామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలో విపక్ష 'ఇండియా' కూటమి తలపెట్టిన భారీ నిరసనను వాయిదా వేయాలని వ్యాపారులు కోరిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వివరాల్లోకి వెళితే, ఎలక్టోరల్ రోల్స్‌లో ప్రత్యేక సవరణలకు సంబంధించి వచ్చిన ఆరోపణల

ఈ85, ఈ100 ఇంధనాలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ !



న్యూఢిల్లీ , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : దేశంలో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు విదేశీ చమురుపై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇథనాల్ ఆధారిత ఇంధన వాడకాన్ని భారీగా ప్రోత్సహించేందుకు వీలుగా కేంద్ర మోటారు వాహన నిబంధనలను సవరిస్తూ కీలక ప్రకటన వెలువరించింది. దీని ప్రకారం ఇకపై ప్రత్యేకంగా రూపొందించిన ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలు 85 శాతం వరకు ఇథనాల్ కలిగిన ఈ85 లేదా ఏకంగా నూటికి నూరు శాతం స్వచ్ఛమైన ఇథనాల్ అయిన ఈ100 ఇంధనంతో పరుగులు పెట్టనున్నాయి. త్వరలోనే మార్కెట్లోకి ఈ100 అనుకూల వాహనాలను తీసుకువచ్చేందుకు ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలు సైతం సిద్ధమవుతున్న తరుణంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ కొత్త ఇంధనాలు అన్ని కార్లు, బైకులకు వర్తించవని.. కేవలం ప్రత్యేకంగా తయారు చేసి, ధ్రువీకరణ పొందిన ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలకు మాత్రమే ఇవి సరిపోతాయని అధికారులు స్పష్టం చేశారు. కొత్త నిబంధనలు రాగానే ఇప్పటికే ఉన్న


8లో

ప్రస్తుతానికి ఇరాన్‌పై దాడి లేదు

డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

అమెరికా , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : అమెరికా-ఇరాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై తక్షణ సైనిక దాడుల విషయంలో తాత్కాలికంగా వెనక్కి తగ్గుతున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. అయితే, ఈ వివాదాన్ని దౌత్యపరమైన ఒప్పందం ద్వారా పరిష్కరించాలా? లేక సైనిక చర్యతో

'అర్ణబ్' తుపానుపై వదంతులు నమ్మొద్దు

అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం : అచ్చెన్నాయుడు

అమరావతి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం నేడు తుపానుగా మారింది. ఈ తుపానుకు 'అర్ణబ్' అని నామకరణం చేశారు. 'అర్ణబ్' తుపాను ఏపీ దిశగా వస్తోందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలో, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. అనవసరమైన వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారత వాతావరణ శాఖ (xవీణ), విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా యంత్రాంగం ఇచ్చే సూచనలను మాత్రమే పాటించాలని సోమవారం స్పష్టం చేశారు. ఈ విపత్కర సమయంలో ప్రజలందరూ సమన్వయంతో, ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించి తుపాను గండం నుంచి సురక్షితంగా బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రి సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సూచనలు జారీ చేశారు.



తీరం దాటేది అప్పుడే.. రెడ్ అలర్ట్ జారీ

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్ణబ్' తుపానుగా మారి వేగంగా బలపడుతోందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇది అక్టోబర్ 26,


8లో

ఇలాగైతే ప్రజల మద్దతు పొందలేరు

ఆ పార్టీ దుకాణం సర్దేసుకోవడం మంచిది : మంత్రి అనగాని

అమరావతి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడుతోందని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల మద్దతు పొందలేకే జగన్ హింసా రాజకీయాలను ఎంచుకున్నారని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పుంగనూరు, తిరుపతి, రాయచోటి, పులివెందుల, కడప, దర్శి, కనిగిరి వంటి ప్రాంతాల్లో


8లో

అవి ఏకగ్రీవాలు కాదు కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలు : షర్మిల

అమరావతి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో నమోదైన ఏకగ్రీవాలపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇవి ప్రజల ఆమోదంతో జరిగిన ఏకగ్రీవాలు కావని, అధికార మదంతో కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. అధికార కూటమి అరాచకాలకు ఈ ఏకగ్రీవాలు నిదర్శనమని, ఇది

ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు : సీఎం

- అర్ణబ్ తుపాను ముప్పు నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశం
- బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు, ఏపీ తీరానికి రెడ్ అలర్ట్ జారీ
- తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్లకు సూచన

అమరావతి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశారు. తుపాను కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో తుపానును ఎదుర్కొనేందుకు



తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, దాని తీవ్రతకు అనుగుణంగా ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. "తుపాను ప్రభావంతో కురిసే వర్షాలు, వీచే గాలులు, సంభవించే వరద ప్రవాహాల తీవ్రతను ముందుగానే అంచనా వేయాలి. గతంలో వచ్చిన తుపానుల సమాచారాన్ని విశ్లేషించి రైతులకు, ప్రజలకు నిరంతరం హెచ్చరికలు జారీ చేయాలి. ఎలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది" అని చంద్రబాబు అన్నారు. తీరప్రాంతాల్లోని ప్రజలను వెంటనే గుర్తించి, సమీపంలోని తుపాను షెల్టర్లకు తరలించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు వర్చువల్ విధానంలో హాజరై తమ జిల్లాల్లోని పరిస్థితులను, తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, 'అర్ణబ్' తుపాను అక్టోబర్ 26 అర్ధరాత్రికి


APTEL/26/A2902

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

సంపాదకీయం

సేద్యానికి సెలవే శ్రేయస్కరం!

నీటి లభ్యత, భూసారం, అనుకూల వాతావరణ పరిస్థితులపై ఆధారపడి వ్యవసాయ రంగం ఉంటుంది. వర్షాలు సమృద్ధిగా కురిసి, జలవనరులు అందుబాటులో ఉన్నప్పుడు పంటల సాగు సాఫీగా సాగి, రైతుకు ఆదాయాన్ని అందిస్తుంది. అయితే లోటు వర్షపాతంతో జలాశయాలు, చెరువులు, భూగర్భజలాలు క్షీణించినప్పుడు పంటల దిగుబడులు తగ్గడమే కాకుండా సాగు పెట్టుబడులు నష్టాలుగా మారి రైతులు అప్పుల పాలయ్యే ప్రమాదముంది. ఈ ప్రభావం తాగునీరు, పశుపోషణ, విద్యుత్ ఉత్పత్తి, గ్రామీణ ఉపాధి, ఆహార భద్రతపైనా పడుతుంది. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షపాత లోటు పరిస్థితుల నేపథ్యంలో రాబోయే యాసంగి సాగును నీటి లభ్యతకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చేపట్టడం అత్యవసరం. ముఖ్యంగా తాగునీటికి ప్రాధాన్యమిస్తూ, నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఒక పంట కాలం సాగుకు విరామం ఇవ్వడాన్ని ప్రత్యామ్నాయంగా పరిశీలించాలి. వ్యవసాయంలో పంట సెలవు కొత్త పరిణామమేమీ కాదు. సుమారు పదిహేనేళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు, పశ్చిమ గోదావరి, ఖమ్మం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వరి రైతులు గిట్టుబాటు ధరలు లభించకపోవడాన్ని నిరసిస్తూ పంట విరామానికి పిలుపునిచ్చారు. ఆర్థిక కారణాలతోపాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల కూడా సాగు విస్తీర్ణం తగ్గిన సందర్భాలున్నాయి. 1987లో దేశవ్యాప్తంగా సంభవించిన తీవ్రమైన కరవు... పంటల ఉత్పత్తి, పశుగ్రాసం, గ్రామీణ ఉపాధి, తాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావం చూపింది. అదేవిధంగా తెలంగాణలో 2015--16లో నెలకొన్న కరవుతో సాగునీటి వనరులు క్షీణించి, అనేక ప్రాంతాల్లో వరి సాగు గణనీయంగా తగ్గింది. ఈ అనుభవాలు కరవు తీవ్రమైన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం కంటే ముందుగానే జలవనరుల లభ్యతను అంచనా వేసి సాగు ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి. గతంలో గిట్టుబాటు ధరల కోసం నిరసనగా ప్రకటించిన పంట సెలవుకు, ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న పంట విరామానికి మౌలికమైన తేడా ఉంది. నాటి పంట సెలవు ఆర్థిక సమస్యలపై నిరసన కాగా, నేటి పంట విరామం కరవు ముప్పును ఎదుర్కొనే ముందస్తు జాగ్రత్త చర్య. ఇందులో భాగంగా అందుబాటులో ఉన్న నీటిని మొదట తాగునీటికి, తరువాత పశుపోషణకు కేటాయించి, మిగిలిన లభ్యత ఆధారంగా వ్యవసాయ సాగును నిర్ణయించాలి. పరిమిత నీటి వనరులున్న ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, శనగ వంటి తక్కువ నీరు అవసరమయ్యే పంటలను స్థానిక నేల, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయవచ్చు. అయితే కనీస నేల తేమ కూడా లేని ప్రాంతాల్లో భారీ పెట్టుబడులతో సాగు చేపట్టి నష్టపోవడం కంటే ఒక పంట కాలం విరామం తీసుకోవడం ఆర్థికంగా సముచితం. సాగుకు ఇచ్చే తాత్కాలిక విరామాన్ని భూసార పునరుద్ధరణకు కూడా ఉపయోగించుకోవచ్చు. గత రెండు దశాబ్దాలుగా అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం, వానాకాలం, యాసంగి సీజన్లలో వరి వంటి ఒకే పంటను నిరంతరం సాగుచేయడం వల్ల అనేక ప్రాంతాల్లో నేల ఆరోగ్యంపై ఒత్తిడి పెరిగింది. పంట విరామ సమయంలో భూసార పరీక్షలు నిర్వహించడం, పంట అవశేషాలను నేలలో కలపడం, సేంద్రియ ఎరువులను వినియోగించడం వంటి చర్యలు చేపట్టాలి. పరిమితంగా నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పచ్చిరొట్ట పంటలను సాగు చేసి భూమిలో కలపవచ్చు. అదేవిధంగా ఒకే పంటను నిరంతరం సాగు చేసే ప్రాంతాల్లో విరామం ఇవ్వడం వల్ల కొన్ని చీడపీడలు, వ్యాధికారకాల జీవచక్రానికి అంతరాయం ఏర్పడి వాటి ఉధృతి తగ్గే అవకాశముంది. అయితే పంట విరామం ఒక్కటే భూసారాన్ని మెరుగుపరచదు. సమగ్ర నేల, పోషక యాజమాన్య చర్యలతో అనుసంధానించినప్పుడే దీర్ఘకాలిక ప్రయోజనాలు సాధ్యమవుతాయి. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షపాత లోటు కారణంగా ప్రపంచంలోని పలు దేశాలతో పాటు, భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లోనూ, ముఖ్యంగా తెలంగాణలోనూ నీటి లభ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని సుమారు 360 మండలాల్లో సాధారణం కంటే 30--40శాతం వరకు వర్షపాత లోటు ఉన్నట్లు వస్తున్న అంచనాలు పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నాయి. ఈ పరిస్థితులు కొనసాగితే డిసెంబరు నాటికి జలాశయాలు, చెరువులు, భూగర్భ జలాల్లో నీటి లభ్యత మరింత తగ్గుతుంది. ముఖ్యంగా వరి వంటి అధిక నీరు అవసరమయ్యే పంటలకు కీలక దశల్లో తగినంత నీరు అందకపోతే దిగుబడులు తగ్గుతాయి. దీంతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలు, విద్యుత్, యంత్రాలపై పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక చిన్న, సన్నకారు రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. అందువల్ల మండలాలవారీగా వర్షపాతం, జలాశయాల నిల్వలు, భూగర్భ జలమట్టాలను సమీక్షించి యాసంగి సాగుపై ముందస్తు నిర్ణయం తీసుకోవాలి. నీటి కొరతకు తోడు విద్యుత్ సరఫరాలోనూ సవాళ్లు తలెత్తవచ్చు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బొగ్గు, సహజవాయువు సరఫరాపై ప్రభావం చూపే అవకాశముండగా, వర్షాభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గవచ్చు. అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్వహణపై ఒత్తిడి పెంచవచ్చు. భూగర్భ జలమట్టాలు పడిపోవడంతో బోర్ల నుంచి నీటిని తోడేందుకు అధిక విద్యుత్ అవసరమవుతుంది. కొత్త బోర్ల తవ్వకం, శక్తిమంతమైన మోటార్ల ఏర్పాటు రైతుల పెట్టుబడి భారాన్ని పెంచినా నీరు లభిస్తుందనే హామీ ఉండదు. ఈ పరిస్థితుల్లో రైతుల ముందున్న ప్రధాన ప్రత్యామ్నాయాలు రెండు. మొదటిది-- నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో స్వచ్ఛందంగా యాసంగి సాగుకు విరామం ఇవ్వడం. రెండవది-- పరిమిత నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో వరికి బదులుగా తక్కువ నీరు అవసరమయ్యే ఆరుతడి పంటలను ఎంచుకోవడం. అయితే ఏ నిర్ణయమైనా సాగు వ్యయం, ఆశించిన దిగుబడి, నేల స్వభావం, తేమ లభ్యత, పంటకాలం, మార్కెట్ అవకాశాలు, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల ఆధారంగా తీసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధానాన్ని అమలు చేయకుండా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించాలి. కరవు సహజ వాతావరణ పరిణామమైనా, దాని ప్రభావాన్ని తగ్గించడంలో ప్రభుత్వం, రైతులు, సంబంధిత శాఖల సమన్వయం కీలకం. ఈ సమస్యను రాజకీయాలకు కాకుండా శాస్త్రీయ అంచనాల ఆధారంగా ఎదుర్కోవాలి. రైతులు కూడా నిరాధార ఆరోపణలకు ప్రభావితం కాకుండా, వాస్తవ పరిస్థితులను బట్టి సాగు నిర్ణయాలు తీసుకోవాలి. అదే సమయంలో, తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజాస్వామిక హక్కును వినియోగించుకోవాలి. పంట విరామంతో రైతుల ఆదాయం, వ్యవసాయ కూలీల ఉపాధి తగ్గే అవకాశం ఉన్నందున చిన్న, సన్నకారు, కౌలు రైతులకు ఆర్థిక సహాయం, రుణాల పునర్వ్యవస్థీకరణ, వడ్డీ ఉపశమనం, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి. గ్రామీణ ఉపాధి హామీ పనులను నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూసార అభివృద్ధితో అనుసంధానించడంతోపాటు పశుగ్రాస సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.



ఎడిటర్ : దొండ్లవాగు భవ్య

ప్రాణ, ఆస్తి నష్టం నివారణకు ముందస్తు చర్యలు సిబ్బందిఅందుబాటులో ఉండాలి : తహసీల్దార్



గూడెంకొత్తవీధి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): రాబోయే మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు, గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గూడెంకొత్తవీధి మండల అధికారులు అప్రమత్తమయ్యారు. తుఫాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సోమవారం జి.కె. వీధి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అన్నాజీ రావు ఆధ్వర్యంలో వీఆర్వోలు, గ్రామ రెవెన్యూ సహాయకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అన్నాజీ రావు మాట్లాడుతూ రాబోయే మూడు రోజుల వర్షాల నేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది తమ తమ హెడ్‌క్వార్టర్లలో అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా ఎక్కడైనా వరదలు, కొండచరియలు విరిగిపడటం, చెట్లు నేలకొరగడం వంటి ప్రమాదాలు సంభవించే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే స్పందించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. మండల ప్రజలు సైతం వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. నిత్యావసర వస్తువులను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని, భారీ వర్షాలు కురిసే సమయంలో అనవసరంగా బయటకు వెళ్లవద్దని సూచించారు. వాగులు, వంకలు, పొంగిపొర్లే కాలువలు దాటే ప్రయత్నం చేయకూడదని, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఏదైనా ప్రమాదం లేదా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం తుఫాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్షాల ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా శాఖల వారీగా అప్రమత్తత పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రమణబాబు, వ్యవసాయ అధికారి సురేష్, డీటీ సత్యనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలమజ్జి, ఉపతహసీల్దార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కళ్యాణ్, వీఆర్వోలు, గ్రామ రెవెన్యూ సహాయకులు తదితర అధికారులు పాల్గొన్నారు.

భారత్ కో జానో క్విజ్ పోటీల్లో ప్రథమస్థానం సాధించిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు



పాయకరావుపేట , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): :శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల నందు భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం ప్రాంత్ వారు (విజయవాడ నుండి విశాఖపట్నం వరకు) నిర్వహించిన భారత్ కో జానో క్విజ్ పోటీల నందు జూనియర్స్ విభాగంలో కె. హేమంత్ రాజా (8వ తరగతి), కె. రేవంత్ ఈశ్వర్ మారుతి (8వ తరగతి) మొదటిస్థానాన్ని కైవసం చేసుకుని ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు పొందారు. విజయవాడలో నవంబర్ 29న జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు ఎంపికయ్యారని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ ప్రధానోపాధ్యాయులు డి.వి. శ్రీనివాస్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సి.హెచ్.సి.కె. నరసింహా రావు, సంయుక్త కార్యదర్శి సి.హెచ్. విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్. మూర్తి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు అభినందించారు.

ఓట్ చోరీపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం

ఏఐసీసీ పరిశీలకులు కిరణ్ మూగా బసవ్



కాకినాడ , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): ఓట్ బచావో.. దేశ్ బచావో కార్యక్రమంలో భాగంగా దేశ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఏఐసీసీ పరిశీలకులు కిరణ్ మూగా బసవ్ అన్నారు.జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సర్ లో భాగంగా అనేక రాష్ట్రాలలో బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు.ఎలక్షన్ కమిషన్ అధికార బీజేపీ కనుసన్నల్లోనే పనిచేస్తోందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే,రాహుల్ గాంధీ ఓట్ చోరీని అనేక సందర్భాల్లో ఎత్తి చూపారన్నారు. పార్లమెంటు సమావేశాలలో వ్యతిరేకించారన్నారు. వివిధ రాష్ట్రాలలో బీజేపీ ఓట్ చోరీ చేసి గెలిచింది. అనేక రాష్ట్రాలలో బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగించారని తెలిపారు.ఈ అంశంపై జాతీయ దినపత్రిక ఇండియన్ ఎక్స్ప్రెస్ వివరణాత్మక కథనం వెలువరించడంతో తమ వాదనకు బలం చేకూరిందన్నారు. బీజేపీ ఓటు చోరీ చేసి గెలిచిందని రుజువైందన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ఉద్యమం చేస్తున్నామని, ప్రజల నుంచి నిరసనలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఇప్పటికే ఢిల్లీలో మెగా ర్యాలీ చేసిందన్నారు. ప్రతి గ్రామం,మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఓట్ చోరీపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నాయని అన్నారు. ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానంద రావు, నగర అధ్యక్షుడు చెక్కా నూకరాజు, తదితరులు మాట్లాడారు. జిల్లా సమన్వయ కర్త శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం

ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్



విశాఖపట్నం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): తుపాను ముప్పు నేపథ్యంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. మత్స్యకారులను అప్రమత్తం చేయడంతో పాటు, ముంపు ముప్పు ఉన్న ప్రాంతాలను గుర్తించి సహాయ శిబిరాలు, నిత్యావసర సరుకులను సిద్ధం చేస్తున్నామన్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, భారీ వర్షాల వల్ల రహదారులపై అడ్డంకులు ఏర్పడితే వెంటనే తొలగించేందుకు అదనపు యంత్రాలను సిద్ధంగా ఉంచామన్నారు. భారత నౌకాదళం, కోస్ట్ గార్డ్‌లను అప్రమత్తం చేయడంతో పాటు, అత్యవనర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లాలో ఒక ఎన్డీఆర్ఎఫ్, ఒక ఎస్డీఆర్ఎఫ్ బృందాన్ని అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచగా, దేశవ్యాప్తంగా మరో 16 బృందాలను అవసరమైనప్పుడు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. తీరప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొండవాలు ప్రాంతాల్లో నివసించే వారిని పరిస్థితులకు అనుగుణంగా సమీపంలోని సహాయ శిబిరాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రసవ తేదీ సమీపంలో ఉన్న గర్భిణులను గుర్తించి, అవసరమైన చోట ముందుగానే ఆసుపత్రులకు తరలించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కలెక్టరేట్ లో జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్‌తో పాటు, జీవీఎంసీ సిటీ ఆపరేషన్స్ సెంటర్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్, జోనల్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్ లుఏర్పాటు చేశామన్నారు. అగ్నిమాపక, పోలీసు శాఖలను కూడా అవసరమైన యంత్రాలు, సిబ్బందితో బలోపేతం చేశామని తెలిపారు. అక్టోబర్ 28న పాఠశాలలు, ఇతర సంస్థల మూసివేతపై పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఈ మూడు రోజులూ అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుత వాతావరణ అంచనాల ప్రకారం అక్టోబర్ 27న భారీ వర్షాలు, 28న అతిభారీ వర్షాలు, 29న మళ్లీ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మూడు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బీచ్‌లు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లకూడదని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. తుపాను సమయంలో ప్రజలకు ఏదైనా అత్యవసర సహాయం అవసరమైతే సంబంధిత కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని కోరారు. తుపాను ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రజలను అప్రమత్తం చేస్తూ సోమవారం ప్రకటన విడుదల చేశారు.

109 డివిజన్లో హోరాహోరీ



అనకాపల్లి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): పట్టణంలోని జీవీఎంసీ ఎన్నికలలో భాగంగా 109 వార్డులో వైసిపి-- జనసేన మధ్య హోరాహోరీ పోరు నెలకొంది. నువ్వా నేనా అనే రీతిలో పోటీ సాగుతోంది. వైసీపీ ఇన్చార్జి కేఎం నాయుడు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ గెలుపుకు బాటలు వేస్తున్నారు.అగ్ర నేతల ప్రోత్సహం లేకపోయినప్పటికీ తనదైన శైలిలో వ్యూహరచన చేస్తూ ముందుకు సాగుతున్నారు . నూకాంబిక మాజీ చైర్మన్ మురళీకృష్ణ వైసీపీకి షాక్ ఇచ్చినప్పటికీ నిరత్సాహం పడకుండా తగిన పందాలో ముందుకు సాగుతున్నారు.. జనసేన నుండి ఎమ్మెల్యే రామకృష్ణ మాజీ కౌన్సిలర్ జోగినాయుడు తదితరులు ఒక సారి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి త్వరలో మాజీ ఎంపీ డాక్టర్ సత్యవతి సమన్వ యకర్త భరత్ కుమార్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు రంగం సిద్ధమైంది. కష్టపడితే వార్డులో గెలుపు సాధ్యమనే రీతిలో పావులు కదుపు తున్నారు.ఎన్నికల ప్రచార కార్యక్రమం గేయం నాయుడు ఆధ్వర్యం లో అభ్యర్థి లలిత ఓటర్లను కలుస్తూ తనదైన శైలిలో ఆకట్టు కుంటున్నారు. ఆర్థికంగా ఎక్కడ వెనకడుగు వేయటం లేదు కార్యకర్తలకు నాయకులకు అభిమానులకు తగిన రీతిలో గౌర వం



ఇస్తూ ముందుకు సాగుతున్నారు. కర్రీ వారి వీధి దేవుడు తోట చాకలిపేట నూకాంబిక టెంపుల్ రామనాయుడు కాలనీ తదితరు ప్రాంతాల్లో ఇరువురు పర్యటించి ఓటర్లను కలిశారు.కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని వివరిస్తున్నారు.కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను జనసేన వాడుకుంటుండగా.. ప్రస్తుతం పెరుగుతున్న అధిక ధరలను ప్రజలకు వివరించి వైసీపీ ఓట్లర్లను ఆకట్టుకుంటున్నారు.అన్ని వింటున్న ఓటర్లు సైతం తనదైన శైలిలో మౌనం వహిస్తున్నప్పటికీ ఒకటిన జరిగే ఎన్నికల్లో తమ నిర్ణయాన్ని తెలియజేయనున్నారు ఏది ఏమైనప్పటికీ 109 డివిజన్లో పోటీ మాత్రం ఆసక్తికరంగా సాగుతుందనటం లో సందేహం లేదు

దొంగతనానికి పాల్పడిన నిందితుడి పట్టివేత



గాజువాక , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): పిర్యాది అయిన గొంప అనురాద w/o హరిప్రసాద్ వయస్సు 39 R/o తిరుమలనగర్, వడ్లపూడి ,గాజువాక లో నివాసం వుంటూ తేదీ 18.10.2026 న రాత్రి వారి యొక్క బండి suzuki access AP 40 CH 2893 ను పెట్టి మరుసటి రోజు మధ్యాహ్నం 12.00 గంటలకు చూసేసరికి కనబడనట్లు తేదీ 22.10.2026 న ఇచ్చిన పిర్యాదు పైన దువ్వాడ పోలీసు వారు cr no 340/2026 U/s 303(2) BNS గా కేసు నమోదు చేసి cc కెమెరాల ఆధారంగా చాలా చక్యంగా ముద్దయిని పట్టుకోవడం అయ్యింది . దర్యాప్తులో భాగంగా తేదీ 24.10.2026 న అంబటి శ్రీను, తండ్రి రామకోటి, వయస్సు 26 సంవత్సరాలు, కులం కాపు, నివాసం ఇండియన్ పెట్రోల్ బంకు వెనుక, లంకెలపాలెం, పరవాడ మండలం, స్వగ్రామం డోర్ నంబర్ 9-150A, బీసీ హాస్టల్ వెనుక, కొత్తవలస, విజయనగరం జిల్లా, అనే వ్యక్తిని అరెస్టు చేయడం జరిగినది. నిందితుడి వద్ద నుంచి దొంగతనానికి సంబంధించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం స్వాధీనం చేసుకోవడం అయినది. ఈ కేసుకు సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. ప్రజలకు విజ్ఞప్తి: ప్రజలు తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసే సమయంలో హ్యాండిల్ లాక్‌తో పాటు అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.

చంద్రబాబు నాయకత్వంలో

విశాఖకు ప్రపంచస్థాయి గుర్తింపు : పల్లా

విశాఖపట్నం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : గంగవరం బీచ్ అందాలను ప్రపంచానికి పరిచయం చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రాకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ సహజ సౌందర్యం ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందేం దుకు ఇటువంటి పరిచయాలు దోహద పడతాయని పేర్కొన్నారు. ప్రకృతి అందాలు, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తూ విశాఖను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యానికి ఇది మరింత ప్రాధాన్యం చేకూరుస్తుందని తెలిపారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు సహా సాంకేతిక రంగాల విస్తరణకు మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి విశాఖ భవిష్యత్తుకు కొత్త అవకాశాలు కల్పిస్తోందన్నారు. కొండలు, సముద్ర తీరం, రాతి కొండచరియలు వంటి ప్రకృతి అందాలు విశాఖకు గొప్ప బలమని, అదే సమయంలో టెక్నాలజీ రంగం వేగంగా విస్తరించే అవకాశాలున్నాయని పల్లా పేర్కొన్నారు. ప్రకృతి, ప్రగతి కలిసి నడిచే నగరంగా విశాఖను తీర్చిదిద్ది, తూర్పు తీరానికి శాన్‌ఫ్రాన్సిస్కోగా అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, దూరదృష్టితో కూడిన ప్రణాళికలు, మంత్రి నారా లోకేష్ సాంకేతిక రంగంపై ప్రత్యేక దృష్టి రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు తీసుకొచ్చేందుకు దోహదపడుతున్నాయని తెలిపారు.

విశాఖ అభివృద్ధిని అడ్డుకున్న జగన్

ఐదేళ్ల వైసీపీ పాలనలో విశాఖ అభివృద్ధిని విస్మరించి, విలువైన భూముల వ్యవహారాలకే పెద్దపీట వేశారని పల్లా విమర్శించారు. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించి ఊదరగొట్టిన జగన్.. ఆ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యవహారాలకే ప్రాధాన్యమిచ్చారని ఆరోపించారు. నగరానికి, ఉత్తరాంధ్రకు చేసిన అభివృద్ధి పనులను చెప్పుకోలేని గొడ్డలి పార్టీ నేతలు ఇప్పుడు 'సేవ్ వైజాగ్' పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

విశాఖ భూములపై వైసీపీ ముఠా కన్ను

జగన్ పాలనలో విశాఖలోని విలువైన భూముల వ్యవహారాలు వివాదాస్పదమయ్యాయని పల్లా పేర్కొన్నారు. బే పార్కు, రుషికొండ ఐటీ హిల్, లూలూ ప్రాజెక్టుకు సంబంధించిన స్థలాలు, వాల్తేరు క్లబ్, రామానాయుడు స్టూడియో, మాన్సాస్ ట్రస్టు, దసపల్లా భూములు, షీలానగర్ ప్రాంతంలోని భూముల కేటాయింపులపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ



జరగాలని డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు, కార్తీక వనం, విశాఖ మన్యంలో ఖనిజ సంపదకు సంబంధించిన వ్యవహారాలపైనా ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని కోరారు. విశాఖకు రావాల్సిన పరిశ్రమలు, పెట్టుబడుల విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పల్లా విమర్శించారు. లూలూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ వంటి సంస్థల ప్రతిపాదనలు ముందుకు సాగకపోవడం, ఫిన్‌టెక్ వ్యాలీ నిర్వీర్యం కావడం, ఏఎంటీజెడ్ విషయంలో ఇబ్బందులు తలెత్తడం రాష్ట్రానికి నష్టం కలిగించాయని పేర్కొన్నారు. భోగాపురం విమానా శ్రయం, గిరిజన విశ్వవిద్యాలయం, పెట్రోలియం విశ్వవిద్యాలయం వంటి కీలక అంశాల్లో గత ప్రభుత్వం ఆశించిన పురోగతి సాధించలేక పోయిందని విమర్శించారు.

చంద్రబాబు నాయకత్వంలో విశాఖ అభివృద్ధి బాట

కూటమి ప్రభుత్వం విశాఖను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని పల్లా తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడం, ప్రపంచస్థాయి సంస్థలను తీసుకురావడం ద్వారా ఉత్తరాంధ్రకు కొత్త అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విశాఖ రైల్వే జోన్ కార్యాలయానికి స్థలం కేటాయించి పనులు ముందుకు తీసుకెళ్లడం, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయం సాధించడం, భోగాపురం విమానాశ్రయ పనులను వేగవంతం చేయడం వంటి చర్యలను వివరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాకు 30 టీఎంసీల నీటిని తరలించే దిశగా ముందడుగు పడిందని తెలిపారు.

ఐటీ, టెక్నాలజీ రంగాల విస్తరణకు లోకేష్ చొరవ

విశాఖను ఐటీ, టెక్నాలజీ, డేటా సెంటర్లకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయడంలో మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని పల్లా పేర్కొన్నారు. ప్రపంచస్థాయి సంస్థలను రాష్ట్రానికి ఆకర్షించడం, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం, యువతకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు పెంపొందించడం ద్వారా విశాఖ ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తున్నారని తెలిపారు. గూగుల్ సంస్థ పెట్టుబడులు, డేటా సెంటర్ల ఏర్పాటుతో విశాఖకు అంతర్జాతీయ సాంకేతిక రంగంలో మరింత గుర్తింపు లభించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

అభివృద్ధిపై విషప్రచారం తగదు

గూగుల్ సంస్థ పెట్టుబడులు, డేటా సెంటర్ల ఏర్పాటుపై గొడ్డలి పార్టీ నేతలు అవాస్తవ ప్రచారం చేస్తూ ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నారని పల్లా ఆరోపించారు. విశాఖకు పెట్టుబడులు రావడం, యువతకు ఉపాధి అవకాశాలు పెరగడం రాష్ట్ర ప్రయోజనాలకు కీలకమని పేర్కొన్నారు. నగర అభివృద్ధికి సహకరించాల్సింది పోయి అడ్డంకులు సృష్టించడం సరికాదని హితవు పలికారు.

విశాఖ ప్రజలు వైసీపీకి గుణపాఠం చెప్పారు

2014లో విశాఖ ప్రజలు జగన్ తల్లిని ఎంపీగా ఓడించిన నేపథ్యంలో, విశాఖపై రాజకీయ కక్షతో వ్యవహరించారనే విమర్శలు అప్పట్లో వచ్చాయని పల్లా పేర్కొన్నారు. నగరంలో గంజాయి సమస్య, రుషికొండ నిర్మాణాలు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాలపై అప్పటి ప్రభుత్వ వైఖరి ప్రజల్లో ఆందోళన కలిగించిందన్నారు.

2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు అభివృద్ధి, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విశాఖను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దడం, మంత్రి నారా లోకేష్ చొరవతో ఐటీ, సాంకేతిక రంగాల విస్తరణకు ఊతమివ్వడం, ఉత్తరాంధ్రకు కొత్త భవిష్యత్తును అందించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, పర్యాటకం, సాంకేతిక రంగాల అభివృద్ధితో విశాఖకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకొస్తామని తెలిపారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించడం మానుకుని, గత పాలనలోని భూ వ్యవహారాలపై వచ్చిన ఆరోపణలకు వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అర్నాబ్ తుపాను

ముప్పు - అనకాపల్లి జిల్లా అప్రమత్తం

మూడు రోజులు బడులకు సెలవు : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం



అనకాపల్లి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. అన్ని శాఖల జిల్లా అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి ముందస్తు జాగ్రత్త చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 26 నుంచి తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలను ఈ నెల 26 సాయంత్రంలోగా గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. తరలించిన వారికి తాగునీరు, భోజనం, వసతి కల్పించాలని, మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందులు ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు.

బదులకు మూడు రోజులు సెలవు

తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బదులకు ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు వేడి తాగునీరు, నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. నిరంతర నియంత్రణ గదులుఈ నెల 26 నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రోజంతా పనిచేసే నియంత్రణ గదిని ఏర్పాటు చేయాలని, విభాగ స్థాయిలో ఆర్టీవో కార్యాలయాల్లో, మండల స్థాయిలో మండల కార్యాలయాల్లో నియంత్రణ గదులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మండల రెవెన్యూ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు ఎవరికీ సెలవులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దేశాలు, అగ్నిమాపక దళాలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్, తంతి సమాచార వ్యవస్థలు నిరంతరం పనిచేసేలా చూడాలని, అత్యవసర సేవలకు విద్యుత్ సరఫరా నిలవకుండా ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఉత్పత్తి యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారుపులు అందుబాటులో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అత్యవసర మందులు, సూది మందులు, వైద్య సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని, సముదాయ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎక్కువ ముప్పు ఉన్న గర్భిణులను ముందుగానే గుర్తించి సమీప ఆసుపత్రులకు తరలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తుపాను సమయంలో ప్రజలు బయటకు రావద్దని, బలమైన గాలులు వీచే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, ప్రచార వలకల దగ్గర ఉండవద్దని, విద్యుత్ తీగలు తెగిపడితే తాకకుండా అధికారులకు తెలపాలని జిల్లా కలెక్టర్ సూచించారు. లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే రహదారులు, వరద పొంగే కాల్వలు దాటవద్దని, తాగునీరు, మందులు, చేతి దీపం, చరవాణి విద్యుత్ నింపుకోవడం ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. వదంతులు నమ్మవద్దని, అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఊరేగింపును తలపిస్తున్న వైసిపి ప్రచారం....

అనకాపల్లి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : పట్టణంలోని 110వ డివిజన్ లో వైసిపి ప్రచారం ఊరేగింపును తలపిస్తోంది.. పెద్ద ఎత్తున మహిళలు అభ్యర్థి ఉగ్గిన జ్యోత్స్నకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు.. ఆర్టీసీ కాంప్లెక్స్.. పూడి మడక రోడ్డు వివేకానంద నగర్ న్యూ కాలనీ ప్రాంతాల్లో విస్తృత పర్యటన సాగుతుంది పట్టణ వైసిపి అధ్యక్షులు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో వార్డు ఇంచార్జ్ ఉగిన అప్పారావు నాయకత్వంలో ప్రచారం జోరుదుకుంది. వార్డు ఎన్నికలు ఇంచార్జ్ శరీరాల మనోజ్ పర్యవేక్షణలో గెలుపుకు వ్యూహాలు పన్నుతున్నారు.. వార్డు పై పట్టు సాధిస్తున్నారు

వైభవంగా వాల్మీకి జయంతి

అనకాపల్లి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : ఆదికవి, రామాయణ మహాకావ్య గ్రంథకర్త అయిన మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను ప్రతీ సంవత్సరం అక్టోబర్ నెల , అశ్విజ శుక్ల పూర్ణిమన నిర్వహిస్తున్న మహర్షి వాల్మీకి జయంతోత్సవం సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ మహర్షి వాల్మీకి ఫోటో కు జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ మరియు డిఆర్వో వై సత్యనారాయణ రావు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ మాట్లాడుతూ ?సత్యం, ధర్మం, మానవీయ విలువల విశిష్టతను సమస్త మానవాళికి చాటిచెప్పిన మహర్షి వాల్మీకి బోధనలు ఎప్పటికీ ఆదర్శనీయమైనవి. బోయే వాల్మీకిగా ఉన్న ఆయన, తపస్సుతో బ్రహ్మర్షిగా మారి లోక కల్యాణం కోసం "శ్రీమద్ రామాయణం"ను రచించి ఆదికవిగా చిరస్మరణీయులయ్యారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆయన మార్గాన్ని అనుసరించి ధర్మబద్ధమైన జీవితాన్ని గడపాలని ఈ సందర్భంగా తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు డి. ఆర్. ఓ తో పాటు, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ మరియు సాధికారిత అధికారి కె . శ్రీదేవి, సహాయ సంక్షేమ అధికారి కె . సుజాత మరియు వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

108 లో పట్టు బిగిస్తున్న వైయస్సార్ కాంగ్రెస్

అనకాపల్లి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : 108 డివిజన్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టు బిగిస్తోంది.. కొద్దిరోజులుగా వెనకబడినట్టు ఉన్న కనీ పించినప్పటికీ గ్రామీణ వార్డ్ పై పట్టు సాధిస్తుంది ఎన్నికల ప్రచారం ఊరేగింపును తలపిస్తోంది.. పరమేశ్వరి పార్క్ గౌరీ సంఘం రోడ్డు రైతు సంఘం రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం జరిగింది మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థి బోడ్డెడ సరోజినీ బృందానికి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.. కరపత్రాలను అందుకున్నారు కచ్చితంగా ఓట్లు వేస్తామని హామీ ఇస్తున్నారు వైసిపి కార్యకర్తలు నాయకులు అభిమానులు నినాదాలు చేస్తూ వర్యటనలు లో విస్తృతంగా పాల్గొంటున్నారు.. మైక్ ప్రచారం హోరందుకుంది.. వైసిపి వార్డు ఇంచార్జ్ శివ తనదైన శైలిలో ఓటర్లను కలుస్తూ ఉత్సాహపరుస్తున్నారు కూ టమి ప్రభుత్వ హయాంలో పెరిగిన ధరలను వివరిస్తున్నారు అధిక ధరల ప్రభావం కూటమికి ఇబ్బందిగా మారుతుంది

శ్రీరామ్ ఫైనాన్స్ అధ్వర్యంలో

100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ



కాకినాడ , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : మోటార్ వెహికల్స్,ఆటోలు నడుపుతూ కుటుంబాలను పోషిస్తున్న కార్మికుల పిల్లల చదువులకు ఆర్థిక చేయూత అందించేందుకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ముందుకు వచ్చింది. సంస్థ కాకినాడ మెయిన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో కాకినాడ టౌన్, రూరల్ ప్రాంతాలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు.సోమవారం కాకినాడ మెయిన్ బ్రాంచ్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్, ఆటో కార్మికుల పిల్లలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4,000 నుంచి రూ.5,000 వరకు స్కాలర్‌షిప్‌ల రూపంలో ఆర్థిక సాయం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్మిక కుటుంబాలకు విద్యాపరంగా అండగా నిలవడంతో పాటు వారి పిల్లల చదువులకు ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా లారీ యూనియన్ ప్రెసిడెంట్ గూడవల్లి మృత్యుంజయరావు (ముత్యం), వారపు రోడ్ వెన్స్ యూనియన్ ప్రెసిడెంట్ చొక్కా నానాజీ, మినీ గూడ్స్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ ఎలుగుబంటి వెంకటరమణతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో

26 ఎంపీటీసీ స్థానాలు జనసేనకు కేటాయించాలి



విజయవాడ, , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తుల సీట్ల కేటాయింపులో భాగంగా పాయకరావుపేట నియోజకవర్గంలో జనసేన పార్టీకి 26 ఎంపీటీసీ స్థానాలు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ బోడపాటి శివదత్త నివేదిక అందించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు రామ్ తాళ్లూరి, చిల్లపల్లి శ్రీనివాసరావులను బుధవారం కలిసి ఈ నివేదికను సమర్పించారు. నియోజకవర్గంలో మొత్తం 87 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 30 శాతం ప్రాతిపదికన జనసేనకు 26 స్థానాలు కేటాయించాలని కమిటీని కోరినట్లు తెలిపారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలో పాయకరావుపేట నియోజకవర్గంలోనే జనసేన రెండు ఎంపీటీసీ స్థానాలను గెలుచుకున్న విషయాన్ని కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. గత ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయాలను పరిగణనలోకి తీసుకొని సీట్ల కేటాయింపుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



విశాఖపట్నం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఆదేశాల మేరకు, ఈ రోజు సోమవారం విశాఖపట్నం సిటీ సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో గల అక్కిరెడ్డిపాలెం, హైస్కూల్ రోడ్డు ప్రాంతాలలో జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది. సౌత్ సబ్ డివిజన్ ఏసీపీ వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫ్లాగ్ మార్చ్‌లో గాజువాక సీఐ వాసు నాయుడు , దువ్వాడ సీఐ గణేష్ , గాజువాక మరియు దువ్వాడ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు. రాబోయే జీవీఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యంగా ఈ ఫ్లాగ్ మార్చ్ చేపట్టడం జరిగింది. ఎన్నికల సమయంలో ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టడం, శాంతిభద్రతల పరిరక్షణపై పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉందనే సందేశాన్ని ప్రజలకు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సహకారంతో జీవీఎంసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు విశాఖపట్నం సిటీ పోలీస్ శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉంది.

మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.2,88,000 ఆర్థిక సాయం



దేవరాపల్లి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : గుండెపోటుతో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి సాటి పోలీసులు పెద్ద మనసు చాటుకున్నారు.దేవరాపల్లి మండలం కొత్తపేంట గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పైలా మోహన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవడం కోసం 2009 బ్యాచ్ కు చెందిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు ముందుకు వచ్చారు.మొత్తం 191 మంది పోలీసు సోదరులు కలిసి రూ.2,88,000 నగదును సేకరించారు. ఈ మొత్తాన్ని సోమవారం మృతుడు మోహన్ భార్య భవాని మరియు ఇద్దరు కుమారులకు అందజేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, తోటి సోదరుడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో సాటి పోలీసులు చూపిన ఈ సాయానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు

రాజుపాలెం లో ఘనంగా
వైఎస్ఆర్సిపి జడ్పీటిసి, ఎంపిటిసి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం



కిర్లంపూడి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం రాజుపాలెంలో పాఠం శెట్టిసూర్యచంద్ర ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చాలా ఘనంగా సాగింది.జడ్పిటిసి అభ్యర్థి పాఠం శెట్టివెంకట శ్రీదేవి మరియు ఎంపీటీసీ అభ్యర్థి దొంగ దుర్గమ్మ కలిసి గ్రామ గడపగడపకు తిరుగుతూ ఉత్సాహంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు గ్రామ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలనపై గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తూ తమ కష్టాలను వెళ్ళ గక్కరు రాష్ట్రంలో సాగుతున్న ఈ ప్రజా వ్యతిరేక పాలన కు రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి గట్టి దెబ్బ తగలడం ఖాయమని ప్రజలు చెప్పారు వైఎస్ఆర్సిపి వైపు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఘనంగా హామీ ఇచ్చారు.ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

చోడవరంపై సందిగ్ధం

జడ్పీటీసీ టికెట్‌పై కూటమిలో కొనసాగుతున్న ఉత్కంఠ



చోడవరం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): స్థానిక జడ్పీటీసీకి కూటమి నుంచి ఎవరు బరిలో వుంటారన్న దానిపై నెలకొన్న ఉత్కంఠ అంతకంతకూ పెరిగిపోతున్నది. టీడీపీకి ఖాయంగా దక్కుతుందనుకున్న ఈ సీటును కూటమిలో మిత్రపక్షమైన బీజేపీ, జనసేన కూడా పట్టుబట్టాయి. ఒక దశలో బీజేపీకి కేటాయించినట్టు ప్రచారం సాగగా, తాజాగా జనసేనకు ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయంటూ ప్రచారం జరుగుతున్నది. దీంతో ఈ స్థానం ఏ పార్టీకి ఖరారవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. టీడీపీ నుంచి జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, పల్లా అర్జున్, వేగి శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో పల్లా అర్జున్, కనిశెట్టి మత్స్యరాజులపై ఐవీఆర్ఎస్ సర్వే కూడా నిర్వహించారు. అయితే బీజేపీ నుంచి కచ్చితంగా చోడవరం సీటు కావాలంటూ ఆ పార్టీ నేతల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు ఆ పార్టీకి ఖరారైపోయిందంటూ శనివారం ప్రచారం సాగింది. బీజేపీ నుంచి బుచ్చెయ్యపేట మండలానికి చెందిన ఈర్లె శ్రీరామమూర్తి నామినేషన్ దాఖలు చేయగా, చోడవరం అభ్యర్థి ఆయనే అని భావించారు. ఒక దశలో టీడీపీ నుంచి నామినేషన్ వేసిన మత్స్యరాజు... బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తారన్న ప్రచారం కూడా సాగింది. ఈ గందరగోళం ఇలా కొనసాగుతుండగానే, జనసేన నుంచి చోడవరం స్థానం కావాలన్న డిమాండ్ పెరిగిందని, దీనికి ఆ పార్టీ అధిష్ఠానం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, చోడవరం జనసేన ఖాతాలో చేరిపోతుందని అంటున్నారు. జనసేన తరపున జెర్రిపోతుల నానాజీ, పెనుపాత్రుని శ్రీనివాస్, నందారపు రమాదేవి నామినేషన్లు దాఖలు చేశారు. జనసేనకు కేటాయిస్తే జెర్రిపోతుల నానాజీ, శ్రీనివాస్‌లలో ఎవరో ఒకరు రంగంలో ఉండే అవకాశం ఉందని ఆ పార్టీవర్గాలు చెపుతున్నాయి. కాగా జడ్పీటీసీ స్థానం తనకు కేటాయించని పక్షంలో రెబల్‌గా కొనసాగేందుకు సిద్ధమంటూ పల్లా అర్జున్ అనుయాయులు తమ అనమ్మతిని పార్టీ అధినేతలకు పంపించినట్టు చెపుతున్నారు. జిల్లా స్థాయిలో నేతలు సమన్వయ చర్చల అనంతరం చోడవరం జడ్పీటీసీపై కూటమిలో నెలకొన్న సందిగ్ధానికి సోమవారం సాయంత్రం తెరపడే అవకాశాలున్నట్టు చెబుతున్నారు.

గృహ హింస బాధితులకు 'రక్షణ'

రెండు దశాబ్దాల్లో 4,101 ఫిర్యాదులు



విశాఖపట్నం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): వివిధ రూపాల్లో గృహహింసకు గురవుతున్న మహిళలకు జిల్లా గృహ హింస రక్షణ విభాగం అండగా నిలుస్తోంది. ఈ తరహా సమస్యలతో వచ్చే బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించడం నుంచి న్యాయ సహాయం, ఆశ్రయం కల్పిస్తోంది. గృహ హింస బాధిత మహిళలకు అండగా 2006 అక్టోబరు 26న కేంద్ర ప్రభుత్వం రక్షణ చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం అందుబాటులోకి వచ్చి దాదాపు 20 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలోని డొమెస్టిక్ వయలెన్స్ సెల్‌కు 4,101 ఫిర్యాదులు అందగా, వీటిలో 490 కేసుల్లో కౌన్సెలింగ్ ద్వారా రాజీ కుదిర్చారు. మిగిలినకేసుల్లో బాధితులకు న్యాయం అందించేందుకు న్యాయస్థానాల ద్వారా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. మారుతున్న జీవనశైలి, భార్యభర్తల మధ్య అభిప్రాయ భేదాలు, స్మార్ట్‌ఫోన్ వినియోగం, సోషల్ మీడియా అతి వినియోగం, అపార్థాలు పెరగడం, కుటుంబసభ్యుల జోక్యం, ఆర్థిక సమస్యలు వంటి కారణాలతో కుటుంబాల్లో విభేదాలు పెరుగుతున్నాయి. చిన్న చిన్న సమస్యలు పెద్ద గొడవలకు దారితీస్తున్నాయి. అ పరిస్థితుల్లో దీధాల మహిళలకు చట్టపరమైన రక్షణ కల్పించడంతోపాటు కుటుంబ సమస్యలను సామరస్యంగా పరిష్కరించేందుకు రక్షణ విభాగం కృషిచేస్తోంది. బాధిత మహిళల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, ఇరువర్గాల వారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. పరస్పర అంగీకారంతో రాజీ కుదురుస్తున్నారు. ఇప్పటికే న్యాయస్థానాల్లో కేసులు దాఖలైన తరువాత రాజీకి వచ్చేవారి సంఖ్య తక్కువగా ఉంటున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. గృహ హింసకు గురైన మహిళలకు కౌన్సెలింగ్‌తోపాటు నిరాశ్రయులకుఆశ్రయం కల్పిస్తున్నారు. బాధితులను ఆర్థికంగా నిలదొక్కుకునేలా నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తున్నారు. కేసుల పరిష్కారం కోసం ఎదురుచూసే సమయంలో జీవనోపాధి మార్గాలను సూచిస్తున్నారు. కలెక్టర్ నిర్వహించే పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలు, రాష్ట్ర మహిళా కమిషన్ నుంచి వచ్చిన ఫిర్యాదులపైనా విచారణ చేపడుతున్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకారంతో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. న్యాయస్థానాలు జారీచేసిన ఉత్తర్వుల అమల్లో పోలీసుల సహకారంతో బాధితులకు అండగా నిలుస్తున్నారు. గ జిల్లాలో 2006 నుంచి గృహ హింస రక్షణ విభాగానికి 4,101 ఫిర్యాదులు అందాయి. వీటిలో 490 కేసుల్లో కౌన్సెలింగ్ ద్వారా పరిష్కార మయ్యాయి. మరో 3,611 కేసులు న్యాయ స్థానాల్లో దాఖలయ్యాయి. వీటిలో 2,238 కేసుల్లో తుది ఉత్తర్వులు వెలువడగా, 53 కేసుల్లో మధ్యంతర ఉత్తర్వులు జారీఅయ్యాయి. ప్రస్తుతం 1,278 కేసులు విచారణ లేదా ఇతర ప్రక్రియల్లో ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం ఈ కేంద్రానికి ప్రొటెక్షన్ ఆఫీసర్‌గా సీహెచ్ సంతోషికుమారి, లీగల్ కౌన్సెలర్‌గా ఎన్. సరోజ, సోషల్ కౌన్సెలర్‌గా బీడీ జ్యోతిలత వ్యవహరిస్తున్నారు.

26వ వార్డు వైసిపి అభ్యర్థిగా గొవ్వాల రాజేష్ మరియు వైసీపీ చైర్ పర్సన్ అభ్యర్థి దూడల విరీతాదేవి

అమలాపురం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): పట్టణ మున్సిపాలిటీ 26వ వార్డు వైసిపి అభ్యర్థిగా గొవ్వాల రాజేష్ మరియు వైసీపీ చైర్ పర్సన్ అభ్యర్థి దూడల విరీతాదేవి మరియు ముమ్మిడివరం నియోజకవర్గ వైసిపి పరిశీలకులు చెల్లు బోయిన శ్రీనివాసరావు ప్రచారంలో పాల్గొన్నారు

సీతానగరం మండలంలో వైఎస్సార్‌సీపీకి భారీ షాక్

సీతానగరం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): సీతానగరం మండలం చిన్నకొండెపూడి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది.చిన్నకొండెపూడి గ్రామ వైసిపి యూత్ ప్రెసిడెంట్ సూరపురెడ్డి రామకృష్ణ వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు, సమర్థవంతమైన నాయకత్వం, రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నాయకత్వానికి, జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై జనసేనలో చేరారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి ఆయనకు జనసేన పార్టీ కండువాకప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రజాక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జనసేన పార్టీకి ప్రజల్లో ఆదరణ రోజురోజుకూ పెరుగుతోందని, పార్టీ బలోపేతానికి, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు.పార్టీలో చేరిన సూరపురెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ... ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నేతృత్వంలో సీతానగరంమండలం లోమరింతగా జనసేన పార్టీ పటిష్టతకు పని చేస్తామని అన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసే వరకు కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ రద్దు



కాకినాడ , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో, ఎన్నికల కోడ్ ముగిసే వరకు కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పిజిఆర్ఎస్ రద్దు

జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్‌కుమార్



అమలాపురం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త):ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున రేపు 26 అనగా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించబడుదని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే అర్జీదారులు ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించబడదని గమనించగలరని తెలియజేస్తున్నాము.

సైకిల్ గుర్తుకే మన ఓటు..ఓటర్లను అభ్యర్థించిన కర్రి శేషారత్నం



అనపర్తి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): పరిషత్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగియడంతో అనపర్తి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల ప్రచార పర్వం ఊపందుకుంది. అనపర్తి ఎంపీటీసీ-6 స్థానానికి కూటమి మద్దతుతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కర్రి శేషారత్నం తన పరిధిలోని ఓటర్లను కలుసుకుని ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని మహిళలను, పెద్దలను వ్యక్తిగతంగా కలుస్తూ కూటమి ప్రభుత్వ అభివృద్ధి నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాము ఓట్లు అడుగుతున్నామని ఈ సందర్భంగా అభ్యర్థి పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటర్లందరూ తమ అమూల్యమైన ఓటును 'సైకిల్' గుర్తుపై వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె ప్రార్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమికి చెందిన స్థానిక నాయకులు, మహిళలు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మానవత్వమే నిజమైన నాయకత్వానికి నిదర్శనం!



జగ్గంపేట , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో చీన 5 రోడ్లు వ్యవసాయం పనులు చేసుకుని వస్తూండగా రోడ్లు వేసే మిషన్ బైక్ ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గండేపల్లి మండలానికి చెందిన ఓ యువకుడి కాళ్లు, చేతులు తీవ్రంగా నుజ్జు నుజ్జు య్యాయి.సంఘటన స్థలంలో ఉండి జగ్గంపేట మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, జడ్పీటీసీ అభ్యర్థి రావుల గణేష్ రాజా వెంటనేస్పందించి ,108 అంబులెన్స్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించి, గాయ పడిన యువకుడిని వెంటనే ఆసుపత్రికి తరలించి మాన వత్వం చాటుకున్న జగ్గంపేట మండలం ఓజ్ఞ్ష అభ్యర్థి రావుల గణేష్ రాజా ఆపదలో ఉన్న వ్యక్తికి సమయానికి సహాయం అందించాలనే తపన, తోటి మనిషి ప్రాణం పట్ల చూపిన బాధ్యత ఆయన మానవత్వానికి నిదర్శనం.రాజకీయం కంటే మానవత్వమే గొప్పది... పదవుల కంటే ప్రాణాలే విలువైనవి. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు స్పందిస్తూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన నాయకత్వం.

మనిషి ఆరోగ్యంలో లైంగిక ఆరోగ్యం అతి ముఖ్యం : డాక్టర్ ఉషా కిరణ్



కాకినాడ , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): లైంగిక ఆరోగ్యం అనేది ఒక వ్యక్తి యొక్క మొత్తం ఆరోగ్యములో అత్యంత ముఖ్యమైన భాగం అని రంగరాయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఉషా కిరణ్ అన్నారు.ఏపీ సెక్స్ కాన్ 2026 మూడవ వార్షిక లైశీగిక రాష్ట్రస్థాయి వైద్య సదస్సు స్థానిక ఎన్ ఎఫ్ సి ఎల్ రోడ్ లో ఉన్న రోటరీ కాకినాడసెంట్రల్ చారిటబుల్ ట్రస్ట్ భవనంలో జరిగింది. సదస్సుకు డాక్టర్ వాడ్రేవు రవి అధ్యక్షత వహించారు. సీనియర్ వైద్యులు డాక్టర్ జి.సమరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉషా కిరణ్ మాట్లాడుతూ ఈ మూడవ వార్షిక సదస్సును కాకినాడలో నిర్వహించడం గొప్ప విషయం గా అభినందించారు.ఆంధ్రప్రదేశ్ సెక్స్ ఎడ్యుకేషన్ అండ్ పేరెంట్ హుడ్ కౌన్సిల్ చేస్తున్న కార్యక్ర మాలు మరింతగా విస్తృతపరచాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మన ఆసుపత్రులలో,వైద్య సంప్రదింపుల లో, తరగతి గదుల్లో లైంగిక వైద్యం అనే అంశం గురించి చాలా తక్కువగా చర్చించబడుతోందని చెప్పారు. చాలామంది రోగులు తమ సమస్యలను ఏళ్ల తరబడి ఎవరికీ చెప్పుకోలేక బాధపడుతున్నారని అన్నారు. కొంతమంది సిగ్గుతో తమ సమస్యలను వెల్లడించలేకపో వడం వల్ల వారి జీవితాలు చాలా దుర్భరంగా మారుతున్నాయని అన్నారు.దాంపత్య జీవితంలో సమస్యలు,సంతానలేమి, ఆందోళన వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంతేకాక కొన్నిసార్లు లైంగిక సమస్యల రూపంలో తొలుత బయటపడే మధుమేహం మరియు గుండె జబ్బులు వంటి వ్యాధులను గుర్తించడం లో కూడా ఆలస్యం అవుతుందని ఆయన అభిప్రాయం పడ్డారు. రోగుల మాటలను వినడమే గాక శాస్త్రీయ ఆధారాలతో చికిత్స అందించాలని వారి జీవితాలకు కొత్త మార్గం చూపించాల్సిందిగా వైద్యులను సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కిమ్స్ ట్రస్టు క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ లైంగిక ఆరోగ్యం అవగాహన పెంపొందించడంలో అపోహలను తొలగించడంలో డాక్టర్ సమరం మరియు డాక్టర్ వెంకటరమణలు చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. రోగులు తమ సమస్యలను సంకోచం లేకుండా చెప్పుకో కలిగే భరోసాను వైద్యులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గోప్యతను,గౌరవాన్ని కాపాడుతూ ఎటువంటి ఇబ్బంది లేకుండా రోగులకు సకాలంలో వైద్యం అందించాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పరిశీలకునుగా ఇలాంటి సదస్సులు అసలైన ప్రయోజనాలు, ఇక్కడ నేర్చుకున్న విషయాలను మన రోజువారి వైద్య సేవలో అమలు చేయడం ద్వారా సమాజానికి ఎంతో మేలు చేయగలిన వారు ఆతామని డాక్టర్ రామకృష్ణ అన్నారు. రాష్ట్ర స్థాయి సదస్సు అర్థవంతమైన చర్చలకు, మెరుగైన వైద్య సేవలకు, దోహదపడాలన్న ఆకాంక్షలు ఆయన వ్యక్తం చేశారు. సదస్సుకు చైర్మన్ డాక్టర్ వాడ్రేవు రవి మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుండి అధిక సంఖ్యలో వైద్యులు రావడం సదస్సుకు హైలెట్ గా ఉందని ఆయన చెప్పారు. ఇటు వంటి సదస్సులు కాకినాడ వంటి నగరంలో నిర్వహించడం తొలిసారి అయినప్పటికీ ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఎంతో పేరు గడిచిన వారిని వారి అనుభవాలను కొత్తగా నేటి వైద్య వృత్తిలోకి వస్తున్న వైద్యులకు అందించాలన్నదే తమ ఆశయమని ఆయన చెప్పారు.కౌన్సిల్ ఆఫ్ సెక్స్ ఎడ్యుకేషన్ అండ్ పేరెంట్ ఫుడ్ కమిటీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ పూష దర్బా మాట్లాడుతూ ఈ సదస్సులో 120 మంది వైద్యులు పాల్గొన్నారు చెప్పారు. ఈ సదస్సులో చర్చించిన పలు అంశాలపై ప్రత్యేక బ్రోచర్ను రూపొందించాల్సిన ఆలోచన ఉందని ఆయన అన్నారు ఎంతో పేరుగాంచిన వైద్యులు తమ వృత్తిలోసాధించిన విజయాలను పొందుపరిచిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అద్భుతంగా వివరించారు. సెక్స్ ఎడ్యుకేషన్ అనేది పాఠ్యాంశంగా రావలసిన అవసరం ఉందని ఈ విషయం వైద్యరంగంలో ఉన్న ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి త్వరలో కార్యరూపం దాల్చే విధంగా సహకరించా లిందిగా ఆర్ఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషాకిరణ్ కోరారు. రాష్ట్రస్థాయి సదస్సు కాన్ఫరెన్స్ కమిటీ కో చైర్మన్ డాక్టర్ త్రిమూర్తులు రాయుడు ఆధ్వర్యంలో అతిధులకు ఘనంగా సత్కార కార్యక్రమాలు నిర్వహించడమే కాక లెక్చర్ఇచ్చిన ప్రముఖ వైద్యులకు ప్రత్యేక జ్ఞాపకలతో అభినందనలు తెలిపారు.

కూటమి గెలుపే లక్ష్యంగా ప్రచారం చేయండి

23వ వార్డు ప్రజలతో మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు



కాశీబుగ్గ , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో కూటమి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ప్రచా రం చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఆదివారం పలాస కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో గల 36 వార్డుల్లో ఎమ్మెల్యే గౌతు శిరీష, మునిసిపల్ చైర్మన్ అభ్యర్థి వజ్జ గంగాభవానితో కలిసి పర్యటించా రు. ఈసందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ఎన్ని కల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి వజ్జ గంగాభవానికి, 23వ వార్డు తరుపున పోటీచేస్తున్న కణితి అశోక్‌కు గెలిపించాలని కోరారు. వార్డులో రోడ్లు, డ్రైనేజీలు లేవని, తాగడానికి మంచినీరు కోసం సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికలు అయిన వెంటనే ఆ మూడు పనుల కోసం నిధులు మంజూరు చేసి పనులు ప్రారం భిస్తానని హామీఇచ్చారు. అనంతరం 23వ వార్డులో వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు చేరారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, లొడగల కామేశ్వరరావు, మోహన్‌రావు, బడ్డ నాగ రాజు, శ్రీనివాస్, నరేంద్ర, గాలి కృష్ణారావు పాల్గొన్నారు. పలాస, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గొడ్డలి పార్టీ నాయకుల వల్ల రాష్ట్రం అధోగతిపాలయ్యిందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మో హన్ నాయుడు తెలిపారు. ఆదివారం పలాసలో మునిసిపాలిటీ కళింగకోమట్ల సంఘం ఆత్మీయ సమావేశంలో రామ్మోహన్‌నా యుడు మాట్లాడుతూ కళింగ కోమట్లను ఓబీసీ జాబితాలో చేర్పిం చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ అభ్యర్థి వజ్జ గంగాభవాని, వజ్జ బాబూరావు, కోట్ని దుర్గాప్రసాద్, శాసనపురి మురళీకృష్ణ, లొడగల కామేశ్వరరావు యాదవ్, మల్లా శ్రీనివాస్, దుర్గారావు పాల్గొనగా టంకాల రవిశంకర్‌గుప్తా సభకు అధ్యక్షత వహించారు.

పీలావారి గౌరీ పరమేశ్వరుల నిలుపు ఉత్సవం



అనకాపల్లి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): గవరపాలెంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వినాయక గౌరీ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ పీలా వారి గౌరి పరమేశ్వరుల నిలుపు ఉత్సవం ఆదివారం జరిగింది మాసోత్సవాల్లో అమ్మవారిని పురవీధులలో మంగళ వాయిద్యాలతో భారీ బాణాసంచా పూలతో ఊరేగింపుగా తీసుకువచ్చి శ్రీ గౌరీ పరమేశ్వరుల నిలుపుదల మహోత్సవం నిర్వహించారు. కోట వీధి శివాలయంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజ అలంకరణ చేసిన అనంతరం ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు అనంతరం విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు కొణతాల రఘునాథ్, శాశ్వత చైర్మన్ భీమర శెట్టివరాహ నూకరాజు, అధ్యక్షులు బీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ధ బల్లమ్మ నాయుడు, కోశాధికారి బీమరశెట్టిలక్ష్మీనారాయణ, ఉ పాధ్యక్షులు. మారిశెట్టి జగన్నాథరావు, జాయింట్ సెక్రెటరీ దాడి రామకృష్ణ, బుద్ధ శ్రీనివాసరావు,బీమరశెట్టి మహాలక్ష్మి నాయుడు కొణతాల కృష్ణ, బుద్ధ శివ,ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

నవంబరు 22న ఏకపాత్రాభినయ పోటీలు



రాజాం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): రాజాంలో నవంబరు 22వ తేదీన ఏకపా త్రాభినయ పోటీలు నిర్వహించనున్నట్టు పోలిపల్లి పైడితల్లి కళాకారుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలరావు, ప్రధాన కార్యదర్శి అర్నిపల్లి వెంకటనాయుడు తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం రాజాం లో బ్రోచర్‌ను విడుదల చేశారు. వచ్చే నెల 22వ తేదీ ఉదయం 9 గంటలకు వస్త్రపురి కాలనీలో జీసీఎస్ఆర్ కళాక్షేత్రంలో పోటీలు ప్రారంభమవుతాయని వెల్ల డించారు. పోటీల్లో పాల్గొనదలచినవారు ప్రదర్శించనున్న పాత్ర సంభాషణతో పా టు రెండు పద్యాలను హార్మోనియం శబ్దం తగ్గించి వీడియో తీసి.. పేరు, ఫోన్ నెంబరు, ఆధార్ కార్డు జిరాక్స్ ఫాస్‌పోర్టు సైజు ఫోటోతో నవంబరు 6వ తేదీలోగా 94417 56874, 8897052000, 6305236018 నెంబర్లకు వాట్సాప్ చేయాలని సూచించారు. ఎంపికైన వారి పేర్లను నవంబరు 12న ప్రకటిస్తామని చెప్పారు. ప్రదర్శన నిడివి 10 నుంచి 15 నిమిషాలు ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, బీవీ అచ్యుత్ కుమార్, గట్టి పాపారావు, మెట్ట దామోదరరావు, మంతపూడి ప్రసాద్, కరణం శంకరరావు, రంపా జగదీష్‌శర్మ, బెవర ముకుంద నాయుడు, అమరాపు కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

23 ఎంపీటీసీ స్థానాలు ఇవ్వాల్సిందే!

దెందులూరు నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తల స్పష్టీకరణ



ఏలూరు , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): దెందులూరు నియోజకవర్గంలో కూటమి సీట్ల కేటాయింపుపై జనసేన నాయ కులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. 75 ఎంపీటీసీ స్థానాలుండగా జనసేనకు కేవలం 11 స్థానాలే కేటాయి స్తా మనడం తగదని నియోజకవర్గ సమన్వయకర్తలు ఘంటసాల వెంకటలక్ష్మీ, కొఠారు ఆదిశేష, సురేష్ అన్నారు. ఆదివారం ఏలూరులో పార్టీ నాయకులు, కార్యకర్తల అత్యవసర సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జన సేన తరపున 27 మంది ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారన్నారు. కూటమి సమన్వయ సమావేశంలో అడిగిన స్థానాలకు, ఎమ్మెల్యే చింతమనేని ఇచ్చిన హామీలకు పొంతన లేదన్నారు. పార్టీ అధిష్ఠానం సూచన మేరకే ఆశా వాహులు నామినేషన్లు వేశారని పేర్కొన్నారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ జనసేనకు 23 ఎంపీటీసీ స్థానాలతో పాటు ఒక ఎంపీపీ, ఒక జడ్పీటీసీ స్థానం కేటాయించాలని డిమాండ్ చేశా రు. నామినేషన్లు వేసిన అభ్యర్థులకు బీఫారాలు ఇవ్వాలన్నారు. సీట్ల పంపకంపై సానుకూల నిర్ణయం తీసుకోకపోతే నామి నేషన్ల ఉపసంహరణకు సిద్ధంగా లేమని, అవసరమైతే ఎన్ని కలను బహిష్కరించే అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

జగన్‌ను ఓడించి విశాఖను ప్రజలే కాపాడుకున్నారు : గంటా



విశాఖ , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): వైసీపీ నాయకులు 'సేవ్ వైజాగ్' పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఇలాంటి నినాదాలు చేస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో జగన్ ను, వైసీపీని ఓడించి విశాఖ నగరాన్ని ప్రజలే కాపాడుకున్నారని ఆయన అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. జగన్ ఐదేళ్ల పాలనలో విశాఖ నగరాన్ని, ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని గంటా ఆరోపించారు. 2014 ఎన్నికల్లో విశాఖ ప్రజలు తన తల్లిని ఎంపీగా ఓడించారనే కక్షతోనే జగన్ ఈ ప్రాంతంపై వివక్ష చూపారని అన్నారు. "మేం అధికారంలో ఉన్నప్పుడు గూగుల్ వంటి సంస్థలను ప్రోత్సహిస్తే, జగన్ రెడ్డి గంజాయి మాఫియాను పెంచి పోషించారు. విశాఖకు వచ్చిన కంపెనీలు కూడా ఆయన హయాంలో పక్క రాష్ట్రాలకు తరలిపోయాయి" అని విమర్శించారు. రుషికొండపై విలాసవంతమైన భవనాల కోసం రూ.500 కోట్లు ఖర్చు చేసిన జగన్, నగర అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని గంటా మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖ అభివృద్ధి పథంలో పయనిస్తోందని తెలిపారు. "విశాఖ రైల్వే జోన్‌కు జగన్ అడ్డుపడితే, మేం అవసరమైన స్థలం కేటాయించి దాన్ని సాధించాం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నాం. భోగాపురం ఎయిర్‌పోర్టును పూర్తి చేశాం. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాకు 30 టీఎంసీల నీటిని అందిస్తున్నాం" అని వివరించారు. భోగాపురం విమానాశ్రయానికి కేటాయించిన 500 ఎకరాలను కాజేయడానికి జగన్ కుట్ర చేశారని ఆరోపించారు విశాఖను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తుంటే, వైసీపీ నాయకులు కుట్రలతో అడ్డుకుంటున్నారని గంటా ధ్వజమెత్తారు. గూగుల్, డేటా సెంటర్లపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఉ త్తరాంధ్రకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో మాదిరిగానే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైసీపీకి ఓటమి తప్పదని గంటా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

సిలగం ఫ్లైఓవర్ వద్ద

రోడ్డు ప్రమాదం..అత్తవారింటికి వెళ్తుండగా ఘటన



కవిటి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): అత్తవారింటికి బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. సిలగం ఫ్లైఓవర్ దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో కంచిలి మండలం బసవపుట్టుగ గ్రామానికి చెందిన దుక్క రామారావు (38) సోమవారం ఉదయం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం రామారావు తన గ్రామం నుంచి కవిటి మండలం కరాపాడు గ్రామంలోని అత్తవారింటికి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఉదయం 8.30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న ఏపీ 39 టీజే 5669 నంబరు గల లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో రామారావు లారీ వెనుక చక్రాల మధ్య చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో ఆయన కుటుంబంలో విషాదం నెలకొంది. ఘటనపై కవిటి ఎస్సై రవివర్మ కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు.

పింఛన్ల పంపిణీలో నూతన విధానం



గరుగుబిల్లి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లకు సంబంధించి నవంబరు నుంచి నూతన విధానం అమలుకా నుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు తమ వాటాలను వేర్వేరుగా పింఛన్‌దారులకు అందించ నున్నాయి. రాష్ట్ర సర్కారు వాటా కింద పింఛన్ నగదు మొత్తాన్ని సచివాలయాల సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందిస్తారు. కేంద్రం వాటాను సంబంధిత పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానంలో జమ చేయనున్నా రు. వృద్ధులు, ఒంటరి మహిళలకు అందించే రూ. 4 వేలుకు గాను కేంద్రం వాటాగా రూ. 200లు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. మిగిలిన మొత్తం రూ. 3,800 రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద నగదు రూపంలో సచివాలయం సిబ్బంది అందిస్తారు. దివ్యాంగులకు సంబంధించి రూ. 6 వేలుకు గాను రూ. 300 బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. రూ. 5,700లు రాష్ట్ర ప్రభుత్వం నేరుగా నగదు రూపంలో అందిస్తారు. నూతన విధానం లో కేంద్ర ప్రభుత్వం వాటా పొందాలంటే విధిగా పింఛన్ దారుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి. ఆధార్ కేవైసీ చేసుకోవలసి ఉంది. ఖాతాలకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ అఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) విధిగా పూర్తయి ఉండాలి. జాతీయ స్థాయిలో ఆధార్ నంబరు ద్వారా ప్రభుత్వ వథకాలకు సంబంధించిన నగదు బదిలీ సులభతరమవుతుంది. జిల్లాలో 1,36,170 మంది నెలవారీ పింఛన్లు పొందుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 58.52 కోట్లు విడుదల చేస్తుంది. పాస్ పుస్తకాలు లేని డిజిటల్ ఖాతాలకు ఆధార్ అనుసంధానమైతే నగదు జమలో సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఎన్‌పీసీఐ లింక్‌ను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పింఛన్‌దారులకు ఎన్ని బ్యాంకు ఖాతాలు ఉన్నా ఎన్‌పీసీఐ లింక్ ఒక్క దానికే అనుసంధానం అవుతుంది. పింఛన్‌దారులు వెబ్‌సైట్ ద్వారా మార్చుకునే అవకాశం ఉంది. 'నవంబరు 1 నుంచి ప్రారంభం కానున్న నూతన విధానంపై ఎంపీడీవోలు, సచివాలయాల సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. విధిగా ఆధార్ అనుసంధానం చేయాలని పింఛన్‌దారులకు సూచించాం. బ్యాంకుల్లో ఆధార్‌కు కేవైసీ చేసుకోకుంటే కేంద్రం వాటా జమ కాదు. ఎన్‌పీసీఐ తప్పనిసరి. ' అని డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ ప్రభావతి తెలిపారు.

ఎన్నికలకు పటిష్ఠ భద్రత : ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్




జంగారెడ్డిగూడెం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): ఏలూరు రేంజ్ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్టు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో, ఏలూరులో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్‌తో కలసి ఐజీ పరిశీలించారు. జంగారెడ్డిగూడెంలో పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రాలు, మార్కెట్ యార్డు, వేగవరం నోవా కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. భద్రతా చర్యలు, కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత తదితర అంశాలపై సిబ్బందితో సమీక్షించారు.జంగారెడ్డిగూడెం డివిజనల్ పోలీసు కార్యాలయంలో సబ్ డివిజన్ పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏలూరులోని చేపల తూము పోలింగ్ కేంద్రం, సీఆర్‌రెడ్డి కాలేజ్ స్ట్రాంగ్ రూమ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఆర్‌రెడ్డి కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించి, భద్రతా ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఐజీ, ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ రోజున సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. వారివెంట జంగారెడ్డిగూడెం, ఏలూరు డీఎస్పీలు వెంకటేశ్వర్లు, శ్రావణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఎంవీ సుభాష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, పోలీసు అధికారులు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.


అభివృద్ధిని చూసి ఓటేయండి : మంత్రి శ్రీనివాస్



విజయనగరం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): విజయనగరం పట్టణంలో గత రెండేళ్లుగా జరుగుతు న్న అభివృద్ధిని చూసి కూటమి అభ్యర్థికి ఓటేయండ ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. నగరంలోని 10, 27, 35, 36వ డివిజన్లలో నిర్వ హించి న ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క విజయనగరం నియోజకవర్గానికే రూ.507 కోట్లు నిధులను మంజూ రుచేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. కూటమి మేయర్ అభ్యర్థి అవనాపు భార్గవి, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, 9వ డివిజన్ అభ్యర్థి సోము భార్గ వి, 10వ డివిజన్ అభ్యర్థి కంది మురళీనాయుడు, 27వ డివిజన్ అభ్యర్థి బర్ల సత్యవేణి, 35వ డివిజన్ అభ్యర్థి కుందేటి గణేష్ పాల్గొన్నారు. నగర కార్పొరేషన్‌లో మేయర్ స్థానం ఓసీ మహిళలకు కేటాయించినప్పటికీ, ప్రతిపక్షం ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించినప్పటికీ బీసీలంతా కూటమి వైపు మొగ్గు చూపడం ఎంతో ఆనందంగా ఉందని కూటమి మేయర్ అభ్యర్థి అవనా పు భార్గవి ఆనందం వ్యక్తం చేశారు. ఆదివారం విజయనగరంలోని అయ్యన్నపేట ప్రాంతంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ప్రచారం నిర్వహించారు. తన మామయ్య అవనాపు సూరి బాబు గతంలో మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశా రని, తన అత్త నాలుగు పర్యాయాలుగా వార్డు కౌన్సిలర్‌గా పనిచేశారని చెప్పారు. తన భర్త అవనాపు విజయ్ కూడా నగరంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నా రని తెలిపారు. ఎమ్మెల్యే అదితి ఆశీస్సులతో బరిలోకి దిగానని, తనను ఆదరించి మేయర్‌గా గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే రూ.44కోట్లు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. నగరంలోని వైఎస్సార్ నగర్ కాలనీలో రూ.12కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామ న్నారు. మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ నగరా నికి అదనంగా రూ.27కోట్లు మంజూరు చేశారని చెప్పారు. ఈ ప్రచారంలో పలువురు కూటమి కార్పొరే ట్ అభ్యర్థులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి





అనకాపల్లి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : ఆర్నాబ్ తుఫాను ప్రభావం దృష్ట్యా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా రెవెన్యూ అధికారి సబ్ డివిజన్ డీఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు , ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు మరియు ఇతర శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాను సన్నద్ధతపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మరియు ఎస్పీ మాట్లాడుతూ శాఖల వారీగా పలు కీలక ఆదేశాలు జారీ చేశారు: రహదారులు ఉ భవనాలు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ: తుఫాను వల్ల ప్రధాన రహదారులు, గ్రామీణ రోడ్లపై నేలకూలే భారీ వృక్షాలు, కొమ్మలు, విద్యుత్ స్తంభాలను తక్షణమే తొలగించేందుకు తగినన్ని జేసీబీలు , పవర్ సా కట్టర్లు (ట్రీ కటింగ్ మిషన్లు) మరియు ప్రత్యేక బృందాలను నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచుకోవాలి. రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తుగా రూట్ క్లియరెన్స్ పనులు చేపట్టాలి. నీటిపారుదల శాఖ (ఇరిగేషన్): జిల్లాలోని అన్ని డ్యామ్‌లు, జలాశయాలు (రిజర్వాయర్లు), చెరువుల నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలి. ప్రమాదకర స్థాయికి నీరు చేరకముందే ఇతర శాఖల అధికారులను అప్రమత్తం చేస్తూ సమాచారం అందించాలని, తద్వారా లోతట్టు మరియు పరివాహక ప్రాంతాల ప్రజలను సకాలంలో సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ: పల్లెలు, పట్టణాలలో ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలు, రేకుల ఇళ్లు, పూరిళ్లలో నివసించే వారిని వెంటనే గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. బలమైన గాలుల వల్ల ప్రమాదాలు జరగకుండా హోర్డింగులను వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాలు (రిలీఫ్ సెంటర్లు): లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత తుఫాను రిలీఫ్ కేంద్రాలకు తరలించాలని, అక్కడ స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం, నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ (ణవీడనూ): ఆసుపత్రులలో వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని, అత్యవసర సమయాల్లో స్పందించేందుకు అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాలో రాబోయే 15 రోజుల్లో ప్రసవ తేదీలు ఉన్న గర్భిణులను గుర్తించి, ముందుగానే సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారులు : నేషనల్ హైవేలపై ఎటువంటి ట్రాఫిక్ జామ్‌లు మరియు అనధికార పార్కింగ్‌లు లేకుండా హైవే మొబైల్స్, హైవే అంబులెన్సులతో పర్యవేక్షించాలని సూచించారు. పోలీస్ ఉ రెవెన్యూ సమన్వయం: పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర విభాగాలు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, జిల్లా యంత్రాంగం అన్ని రకాల సహాయక చర్యలతో సిద్ధంగా ఉందని, అత్యవసర సమయాల్లో అధికార యంత్రాంగాన్ని సంప్రదించాలని అధికారులు కోరారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

విశాఖపట్నం రేంజ్ ఐజీపీ గోపినాథ్ జట్టి ఐపీఎస్..ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై విశాఖపట్నం రేంజ్ ఐజీపీ శ్రీకాకుళం జిల్లా అధికారులతో సమీక్ష

శ్రీకాకుళం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : స్థానిక సంస్థల ఎన్నికలను ప్ర శాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని విశాఖపట్నం రేంజ్ ఐజీపీ గోపినాథ్ జట్టి ఐపీఎస్ జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన రేంజ్ ఐజీపీ జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపీఎస్‌తో పాటు జిల్లాలోని పోలీసు అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎన్నికల సన్నద్ధత, నామినేషన్ల పరిశీలన, శాంతిభద్రతల పరిస్థితి, ముందస్తు నివారణ చర్యలు, ఎన్నికలకు ముం దు, అనంతరం తీసుకో వాల్సిన భద్రతా చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహి ంచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.వి. మహే శ్వర రెడ్డి ఐపీఎస్, స్థానిక సంస్థలు ఎన్నికలలో భాగంగా పోలింగ్ కేంద్రా లు, సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలు, బైండోవర్లు ,బందోబస్తు, సిబ్బంది, ఎన్నికల నిర్వహ ణ పై ఇప్పుడు వరకు చేపట్టిన ఎన్ఫోర్స్మెంట్ చర్యలు తదితర అంశాల ను రేంజ్ ఐజి కి వివరించారు. ఈ సందర్భంగా రేంజ్ ఐజి మాట్లాడుతూ.. ఎన్నికల భద్రతకు పటిష్ట ప్రణాళిక: ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, చట్టాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఐజీపీ సూచించారు. సమస్యాత్మక, సున్నితమైన గ్రామాలు, పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి, వాటి పరిస్థితులకు అనుగుణంగా పోలీసు బలగాలు, అదనపు సిబ్బంది, రిజర్వ్ బలగాల మోహరిం



పునకు పక్కా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్లు, పాత నేరస్తులు, ఎన్నికల సమయంలో అల్లర్లకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, అవసరమైన బైండోవర్ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలును వేగవంతం చేసి, నేరాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అక్రమ మద్యం, ఆయుధాల రవాణాపై ప్రత్యేక నిఘా ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అక్రమ మద్యం వినియోగించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఐజీపీ ఆదేశించారు. నాటుసారా తయారీ, నిల్వ, విక్రయాలు, అక్రమ మద్యం రవాణాపై నిఘా పెంచడంతో పాటు, ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి జరిగే అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అక్రమ ఆయుధాల తయారీ, నిల్వ, రవాణా, వినియోగంపై తనిఖీలు నిర్వహించి, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో పర్యటనలు – ప్రజలతో సమన్వయం

గతంలో ఎన్నికల ఘర్షణలు జరిగిన ప్రాంతాలు, సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు అధికారులు విస్తృతంగా పర్యటించాలని, 'పల్లె నిద్ర' కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఐజీపీ సూచించారు. గ్రామ పెద్దలు, ప్రజలతో సమావేశాలు నిర్వహించి, స్థానిక సమస్యలు, రాజకీయ విభేదాలు, వర్గ ఘర్షణలకు దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించి, వాటి నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సోషల్ మీడియాపై నిరంతర పర్యవేక్షణ

ఎన్నికలకు సంబంధించి తప్పుడు వార్తలు, వదంతులు, రెచ్చగొట్టే పోస్టులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సమాచారంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఐజీపీ ఆదేశించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, డిజిటల్ కంటెంట్ సృష్టికర్తలు సమాచారాన్ని ప్రచారం చేసే ముందు వాస్తవాలను నిర్ధారించు కోవాలని అవగాహన కల్పించాలన్నారు. చట్టవిరుద్ధమైన, ప్రజలను రెచ్చగొట్టే సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

శాఖల మధ్య సమన్వయం – నిష్పక్షపాత పోలీసింగ్

ఎన్నికల నిర్వహణలో పోలీసు, రెవెన్యూ, ఎన్నికల, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, కీలక సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని ఐజీపీ సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది రాజకీయ ప్రభావాలకు అతీతంగా, ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు, అక్రమ కార్యకలాపాలపై తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలకు ముందు, పోలింగ్ సమయంలో, ఎన్నికల అనంతరం శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఐజీపీ స్పష్టం చేశారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు ప్రణాళికలు, నిఘా వ్యవస్థ, నేర నియంత్రణ చర్యలపై తాజా సమాచారంతో అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా భద్రత కల్పిస్తూ, జిల్లాలో ప్రశాంతమైన, పారదర్శకమైన, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఐజీపీ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ పి శ్రీనివాసరావు, డీఎస్పీలు సి. హెచ్. ధనుంజేయ నాయుడు,డి. లక్ష్మణరావు, జీవి రమణ, ఎస్బి ఇన్స్పెక్టర్ ఇమ్మాన్యూల్ రాజ్, ఎలక్షన్ సెల్ ఇన్స్పెక్టర్ అప్పారావు, డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీను,ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సామర్లకోటలో జనసేన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా జబర్దస్త్ టీం ప్రచారం



సామర్లకోట , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా సామర్లకోట పట్టణంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా జనసేన పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు ఆధ్వర్యంలో ఆదివారం సామర్లకోట పట్టణంలోని 30వ వార్డు నుంచి 36వ వార్డు వరకు జబర్దస్త్ టీం సభ్యులు రేసింగ్ రాజు, దొరబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సామర్లకోట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పిట్టా జనకిరామారావుతో పాటు జనసేన పార్టీ వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా నాయకులు, కళాకారులు స్థానిక ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటును వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా జబర్దస్త్ టీం సభ్యులు రేసింగ్ రాజు, దొరబాబు మాట్లాడుతూ, జనసేన పార్టీ అభ్యర్థులకు కేటాయించిన గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి, చైర్మన్ అభ్యర్థితో పాటు వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజల ఆదరణతో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేస్తున్నాయని, ప్రతి వార్డులో ప్రజల మద్దతును కూడగడుతూ ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగిస్తున్నామని నాయకులు తెలిపారు.

112 వ వార్డులో కొణతాల విస్తృత ప్రచారం



అనకాపల్లి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : జీవీఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జీవీఎంసీ 112వ వార్డులో విస్తృత ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. .ఈ సందర్భంగా విజయరామ రాజుపేట వీధులు, పరిసర ప్రాంతాల్లో కూట మి కార్పొరేటర్ అభ్యర్థి ఆళ్ల వైష్ణవి గతో తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను కలుసుకొని అత్యధిక మెజారిటీతో గెలిపించా లని కోరారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాల్లో కూటమి తరఫున ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 112 వ వార్డు జనసేన పార్టీ ఇంచార్జ్ ఆళ్ల రామచంద్ర రావు , తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పోలవరపు త్రినాథ్ కూటమి నాయకులు పాల్గొన్నారు.



మంత్రి వాసంశెట్టి సుభాష్ విస్తృత ప్రచారం

రామచంద్రపురం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : రామచంద్రపురం పట్టణాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా కూటమి నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం పట్టణంలోని 9, 24వ వార్డుల్లో విస్తృతంగా పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి వేడిశెట్టి శేషారావుతో పాటు 9వ వార్డు అభ్యర్థి చిక్కం రామ శ్రీనివాస రావు, 24వ వార్డు అభ్యర్థి కొండపల్లి విశ్వతేజకు మద్దతుగా ప్రజలను కలుసుకు న్నారు. ప్రజలతో నేరుగా మమేక మవుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిం చారు. పట్టణ ప్రగతి, ప్రజా సంక్షేమం కొనసాగేందుకు కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

ఆర్థిక ఇబ్బందుల నుంచి అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం –మంత్రి సుభాష్

ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లా డుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకు రావడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన అమరావతి రాజధాని నిర్మాణం,



పోలవరం ప్రాజెక్టు పనులు, రహదారుల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి స్పష్టం చేశారు.

గత వైసీపీ పాలనలో అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైంది– మంత్రి విమర్శ

గత వైసీపీ ప్రభుత్వ పాలనపై మంత్రి సుభాష్ విమర్శలు గుప్పించారు. అభివృద్ధి కార్యక్రమాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా రాష్ట్రాన్ని పలు రంగాల్లో వెనక్కి నెట్టారని ఆరోపించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, కీలక ప్రాజెక్టులు ఎంతో అవసరమని, వాటిని వేగవంతం చేయడం ద్వారానే భవిష్యత్తులో మరిన్ని ఉపాధి అవకాశాలు, ఆర్థిక ప్రగతి సాధ్యమవుతాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు.

మంత్రి సుభాష్ అభివృద్ధి పనులను గమనించి ఓటు ఇవ్వండి – మేడిశెట్టి శేషారావు

మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి మేడిశెట్టి శేషారావు మాట్లాడుతూ.. రామచంద్రపురం నియోజకవర్గంతో పాటు పట్టణంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనించాలని కోరారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజారోగ్యానికి సంబంధించిన కార్యక్రమాల అమలులో మంత్రి చేస్తున్న కృషిని పరిశీలించి ఓటు వెయ్యాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ అభివృద్ధిని నిరంతర ప్రక్రియగా కొనసాగించేందుకు స్థానిక సంస్థల్లో ప్రజల సమస్యలపై అవగాహన కలిగిన ప్రతినిధులు అవసరమని పేర్కొన్నారు. చైర్మన్ అభ్యర్థిగా తనకు, 9వ వార్డు అభ్యర్థి చిక్కం రామ శ్రీనివాసరావుకు, 24వ వార్డు అభ్యర్థి కొండపల్లి విశ్వతేజకు ప్రజలు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. 9, 24వ వార్డుల్లో సాగిన ప్రచారంలో మంత్రి సుభాష్, మేడిశెట్టి శేషారావు, ఇతర కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు నారపు రెడ్డి బలరాం, కంచుమర్తి బాబురావు, గణేష్ శర్మ, పోలిశెట్టి శ్రీనివాస్, కొండ్రెడ్డి శ్రీనివాసరావు, తాళాబత్తుల మురళి, బ్రహ్మం, వైట్ల ప్రకాష్, దత్తు తదితరులతో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హోప్ ఐలాండ్ వాసులను సురక్షిత ప్రాంతానికి తరలించిన జిల్లా యంత్రాంగం



కాకినాడ , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : ఆర్నాబ్" తుఫాన్ హెచ్చరిక ల నేపథ్యంలో తాళ్లరేవు మండలం హోప్ ఐలాండ్ కు చెందిన సుమారు 130 మందిని జిల్లా కలెక్టర్ ఎం. ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు సోమ వారం ప్రత్యేక బోట్లలో రెవెన్యూ మత్స్యశాఖ పోలీసు సిబ్బంది సహాయంతో కాకినాడ రూరల్ మండలం తూరంగి వద్ద గల ఐలాండ్ కాలనీకి కాలనీకి సురక్షితంగా చేర్చడమైనది.

అవినీతి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం



విశాఖపట్నం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) :అవినీతిని నిర్మూలించి, పారదర్శకమైన పాలన అందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'విజిలెన్స్ వారోత్సవాల'లో భాగంగా, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక అవగాహన పోస్టర్లను కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగినా, అవినీతికి పాల్పడినా ప్రజలు భయపడకుండా వెంటనే ఏసీబీ అధికారులను ఆశ్రయించాలని సూచించారు. సమాజంలో అవినీతి రహిత వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రజల్లో చైతన్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. టోల్ ఫ్రీ నెంబర్: 1064 , వాట్సాప్ నెంబర్: 94404 40057 , ఈమెయిల్ : complaint s-acb @ap.gov.in , ఫోన్ నెంబర్: 0866-2428770 , ప్రజలు ఈ నెంబర్లను ఉపయోగిం చుకుని అవినీతిపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని అధికారులు స్పష్టం చేశారు.

భారీ నుంచి అతి భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అక్టోబర్ 27, 28 తేదీల్లో స్థానిక సెలవు.. విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు మూసివేత : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : భారీ నుంచి అతి భారీ వర్షాలు, తుపాను ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించిన అత్యవసర సమీక్ష, వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికలు మేరకు తూర్పు గోదావరి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలగకుండా నిబంధనలను పాటిస్తూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హాజరవ్వడం జరిగింది. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, సహాయ కలెక్టర్ కె ఆదిత్య శర్మ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ అతి భారీ వర్షాలు నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికలు అనుసరించి ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. వాతావరణ శాఖ హెచ్చరికలు అనుసరించి జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను అప్రమత్తంగా ఉంచాలని, వర్షాలు, వరదల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న గ్రామాలు, వాగులు, వంకలు, నదీ పరివాహక



ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, పునరావాస కేంద్రాలను సిద్ధం చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు, రహదారులకు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు చర్యలు చేపట్టాలని, అత్యవసర సేవలను అందించేందుకు సిబ్బంది, అవసరమైన పరికరాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు, భద్రతా సూచనలు అందించాలని పేర్కొన్నారు.

విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు రెండు రోజులు స్థానిక సెలవు

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో జిల్లాలో స్థానిక సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ రెండు రోజులు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు మూసివేయాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఈ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ఎటువంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా తక్షణమే స్పందించాలని ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన ముందస్తు చర్యలు, శాఖల వారీగా సంసిద్ధతపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించాలని పేర్కొన్నారు.

అత్యవసర కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు

– జిల్లా కలెక్టరేట్, రాజమహేంద్రవరం: 08832-944455
– సబ్ కలెక్టర్ కార్యాలయం, రాజమహేంద్రవరం: 08832-442344 – ఆర్డీవో కార్యాలయం, కొవ్వూరు: 08813-231488 భారీ వర్షాలు, వరదలు, నీటి నిల్వలు, రహదారులపై ఇబ్బందులు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు సంబంధిత కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అధికార యంత్రాంగం నుంచి వెలువడే హెచ్చరికలు, సూచనలు పాటిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలు!



కోటబొమ్మాళి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): టెక్కలి నియోజకవర్గంలో వైకాపా పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నాయకత్వంపై విశ్వాసంతో వైకాపా నాయకులు, కార్యకర్తలు టీడీపీ వైపు అడుగులు వేస్తున్నారు. నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల పరిధిలో ఈ చేరికలు కొనసాగుతున్నాయి, సోమవారం సాయంత్రం నందిగాం మండలం నందిగాం పంచాయతీకి చెందిన 25 మంది వైకాపా కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. నిమ్మాడలోని మంత్రి అచ్చెన్నాయుడు క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకుని టీడీపీలో చేరారు. నూతనంగా పార్టీలో చేరిన వారిని మంత్రి అచ్చెన్నాయుడు సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కుమరాన జానకి, గున్నయ్య, సనపల అప్పయ్య, తవిటయ్య తదితరులు ఉన్నారు. టెక్కలి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ పాలన, మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వంపై తమకున్న విశ్వాసంతో వైకాపా నుంచి టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నామని కొత్తగా చెరిన కార్యకర్తలు తెలిపారు.

అర్నబ్ తుఫాను ముందస్తు చర్యలపై సమన్వయ సమావేశం

గాజువాక , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): అర్నబ్ తుఫాను కారణంగా భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సోమవారం గాజు వాక మండల తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అర్నబ్ తుఫాను ప్రత్యేక అధికారి, జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి , గాజువాక తహసీల్దార్ త్రినాథ్ , గాజువాక పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామకృష్ణ , దువ్వాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకట్ లక్ష్మి పాల్గొన్నారు. వీరితో పాటు రెవెన్యూ, జీవీఎంసీ, ఆరోగ్య, విద్యుత్, అగ్నిమాపక శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమావేశంలో తుఫానుకు ముందు, తుఫాను సమయంలో, తుఫాను అనంతరం చేపట్టాల్సిన చర్యలు, లోతట్టు ప్రాంతాల ప్రజల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో వివిధ శాఖలు సమన్వయంతో స్పందించడం, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం వంటి అంశాలపై చర్చించారు. ప్రజలకు సూచనలు: వాతావరణ శాఖ జారీ చేసే అధికారిక హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి. భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదు. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకూడదు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకకూడదు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారులు ఇచ్చే సూచనలను పాటించాలి. తుఫాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అప్రమత్తంగా ఉండాలని సమావేశంలో చర్చించారు. ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటిస్తూ తుఫాను నివారణ చర్యలకు సహకరించాలని అధికారులు సూచించారు.

సింహాచల దేవస్థానం ముందస్తు అప్రమత్తత



సింహాచలం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): 'ఆర్నాబ్' తుపాను హెచ్చరికల నేపథ్యంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం యంత్రాంగం పూర్తిస్థాయి లో అప్రమత్తమైంది. భక్తుల రక్షణే ధ్యేయంగా కొండపైన, కొండ దిగువ న చేపట్టిన ముందస్తు జాగ్రత్తలను దేవస్థానం ఈవో శ్రీ జల్లేపల్లి వెంకట రావు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, తుపాను పరిస్థితులను పర్యవేక్షిం చేందుకు కొండపై ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్‌తో పాటు ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలను రంగంలోకి దించినట్లు తెలిపారు. ఘాట్ రోడ్లలో ప్రమాదకర చెట్ల కొమ్మలను తొలగించడం, నిరంతరాయ విద్యుత్ సరఫరాకు జనరేటర్లు, డీజిల్ నిల్వలు సిద్ధం చేయడం, కొండపై డ్రైనేజీల పూడికతీత పనులను వేగవంతం చేశామని వెల్లడించారు. స్వామివారి నివేదన, నిత్యాన్న ప్రసాదం కోసం 10 రోజులకు సరిప డా సరుకులు నిల్వ ఉంచామన్నారు. భక్తుల భద్రత దృష్ట్యా తుపాను సమయంలో మెట్ల మార్గాన్ని పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. కృష్ణాపురం గోశాలలో గోవుల రక్షణకు పటిష్ట ఏర్పాట్లు చేశామని, వాతా వరణం అనుకూలించే వరకు భక్తులు అధికారులకు సహకరి ంచాలని విజ్ఞప్తి చేశారు. గాజువాక, సోమవారం: అర్నబ్ తుఫాను కారణంగా భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సోమవారం గాజువాక మండల తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అర్నబ్ తుఫాను ప్రత్యేక అధికారి, జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి, గాజువాక తహసీ ల్దార్ త్రినాథ్ , గాజువాక పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామకృష్ణ , దువ్వాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకట్ లక్ష్మి పాల్గొన్నారు. వీరితో పాటు రెవెన్యూ, జీవీఎంసీ, ఆరోగ్య, విద్యుత్, అగ్నిమా పక శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి 55 ఏళ్ల వ్యక్తి మృతి

దేవరాపల్లి , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): దేవరాపల్లి మండలం మారేపల్లి గ్రామానికి చెందిన కామిరెడ్డి సూర్యనారాయణ (55) పురుగుల మందు తాగి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. సూర్యనారాయణ మద్యానికి బానిసై ప్రతిరోజూ మద్యం సేవించి ఇంటికి వస్తుండేవాడు. కుటుంబ సభ్యులు పలుమార్లు మందలించినా అలవాటు మార్చుకోలేదు.తేదీ 25.10.2026 రాత్రి సుమారు 10 గంటలకు మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. అనంతరం అన్నం కావాలని అడగడంతో భార్య వంటగదిలోకి వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి సూర్యనారాయణ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. నోటి నుండి విషవదార్థం వానన రావడంతో వెంటనే దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్యులు విషం తాగినట్లు నిర్ధారించి ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నం కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తేదీ 26.10.2026 ఉదయం 6.30 గంటలకు మృతి చెందాడు.ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న దేవరాపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సు



విశాఖపట్నం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్. ఆధ్వర్యంలో విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ , సిఐఐ యంగ్ ఇండియన్స్ భాగస్వామ్యంతో తిమ్మాపురంలో గల విజ్ఞాన్స్ వరల్డ్ వన్ స్కూల్ నందు ఈ రోజు "సైబర్ క్రైమ్ సవాళ్లు: రక్షణ, నివారణ మరియు చర్యలు" అనే అంశంపై సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సు మరియు ప్యానెల్ చర్చను నిర్వహించడం జరిగింది. సైబర్ ముప్పులపై అవగాహన పెంచడం మరియు సురక్షితమైన, బాధ్యతాయుతమైన డిజిటల్ అలవాట్లను ప్రోత్సహించడం కోసం పాఠశాల విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్యానెల్ చర్చలో VCSC ఛైర్మన్ మరియు పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., పాల్గొని, సైబర్ నేరాలలో వస్తున్న నూతన పోకడలు మరియు సవాళ్లపై మాట్లాడారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రతకు సంబంధించిన వివిధ అంశాలను వివరిస్తూ 24 లఘు చిత్రాలను ప్రదర్శించారు. ప్యానెల్ చర్చ సందర్భంగా సైబర్ పోలీస్ స్టేషన్‌లో నమోదువుతున్న కేసుల గురించి కమిషనర్ మాట్లాడారు. కెవైసి మోసాలు, స్టాక్ మార్కెట్ పెట్టుబడి మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు మరియు ఇతర ఆన్‌లైన్ ఆర్థిక నేరాల గురించి వివరించారు. నిజ జీవిత సైబర్ నేరాల ఉదాహరణలను ప్రస్తావిస్తూ, సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత పద్ధతులు మరియు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా బాధితులను ఎలా బురిడీ కొట్టించి లబ్ధి పొందుతున్నారో స్పష్టం చేశారు. ఏదైనా సమాచారం వచ్చినప్పుడు దాని ప్రామాణికత ను సరిచూసుకోవడం, వ్యక్తిగత మరియు ఆర్థిక వివరాలను భద్రపరుచుకోవడం, ఆన్‌లైన్ లావాదేవీలు మరియు పెట్టుబడులు పెట్టేటప్పుడు అప్రమత్తంగా ఉండటం అత్యంత కీలకమని ఆయన నొక్కి చెప్పారు. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లలో మోసగాళ్లు పోలీసు అధికారులలాగా, ప్రభుత్వ అధికారులలాగా నటిస్తూ, నిందలు వేస్తూ భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు ఎలా వసూలు చేస్తున్నారో వివరించారు. భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, తక్షణమే సరైన మార్గాల ద్వారా సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సైబర్ ముప్పులను గుర్తించడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మరియు సైబర్ నేరాలను నివేదించడానికి ఉన్న మార్గాలను అర్థం చేసుకోవడంలో విలువైన సమాచారాన్ని పొందారు. యువతలో సైబర్ అవగాహన పెంపొందించడం మరియు పిల్లలు డిజిటల్ వేదికలను సురక్షితంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించేలా మార్గదర్శనం చేయడంలో తల్లిదండ్రుల పాత్రను ఈ కార్యక్రమం ప్రముఖంగా ప్రస్తావించింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సహకరించిన విజ్ఞాన్స్ వరల్డ్ వన్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి పూర్ణిమ ఖకి VCSC తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. చర్చలో తమ అమూల్యమైన సలహాలు, విశ్లేషణలు అందించిన ప్యానెల్ వక్తలు అడ్వకేట్ వివేక్ గుప్తా మరియు సైకియాట్రీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ నివేదిత వాసిరెడ్డి కు కూడా అభినందనలు తెలిపారు. పాఠశాలలో ఈ అవగాహన సదస్సును విజయవంతంగా నిర్వహిం చడంలో కృషి చేసిన సిఐఐ యంగ్ ఇండియన్స్ చైర్‌పర్సన్ దీపా కొడాలి మరియు వైస్ చైర్‌పర్సన్ సాయి సుప్రియ కు VCSC కృతజ్ఞతలు తెలిపింది. సైబర్ అవగాహనను పెంచడంలో మరియు సైబర్ నేరాలను అరికట్టడంలో విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, చట్టాన్ని అమలు చేసే విభాగాలు మరియు సామాజిక సంస్థల మధ్య భాగస్వామ్యం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం చాటిచెప్పింది. విద్య, నివారణ చర్యలు మరియు సమయానికి ఫిర్యాదు చేయడం ద్వారా సైబర్ సెక్యూరిటీ అవగాహనను పెంచడం, బాధ్యతా యుతమైన డిజిటల్ ప్రవర్తనను ప్రోత్సహించడం మరియు సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం.

కూటమి నుంచి మన ఆస్తులు కాపాడుకుందాం

వైఎస్సార్‌సీపీ విశాఖ మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి పిలుపు



విశాఖపట్నం , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త): రెండేళ్ల కూటమి పాలనలో విశాఖ నగరంలో పర్యావరణాన్ని పూర్తిగా నాశనం చేస్తూ కొండలను తొలిచివేశారని, తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నారని వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఆడబిడ్డ నిధి కింద రావాల్సిన రూ. 54,000 బకాయిలు, పింఛన్ల ద్వారా ఇవ్వాల్సిన రూ. 1.44 లక్షలను ఎగ్గొట్టారని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఇస్తామన్న రూ. 3,000 నిరుద్యోగ భృతిని ఇవ్వకుండా యువతను కూటమి ప్రభుత్వం మోసగించిందని ఇవన్నీ ఇచ్చిన తర్వాతే ప్రజలను ఓటు అడగాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ గారు విశాఖను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి విశ్వనగరంగా తీర్చిదిద్దితే, గత రెండేళ్ల కూటమి పాలనలో విశాఖ నగరం సర్వనాశనమైపోయి, ప్రజలు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుని కార్మికుల వెంటే నిలిచింది ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమేనని వరుదు కళ్యాణి స్పష్టం చేశారు. కూటమి పాలనలో గంజాయి, డ్రగ్స్, మద్యం విచ్చలవిడిగా పెరిగిపోయి మహిళలకు, యవతకు రక్షణ లేకుండా పోయిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలో అక్రమ భూకబ్జాలు విపరీతంగా పెరిగిపోయాయని, పేదల ఆస్తులను కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. సింహాచలం వద్ద కొండను కొట్టేసి చేసిన పర్యావరణ విధ్వంసం చేస్తున్నారని, ఆ ప్రాంతాన్ని మళ్లీ సుందరంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. మేయర్‌గా గెలిచాక గీతం భూములు, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, సింహాచలం అప్పన్న భూముల పరిరక్షణపై మొదటి సంతకం చేసి తీర్మానాలు చేస్తామని ప్రకటించారు. జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, వైఎస్సార్‌సీపీ అభివృద్ధి కార్యాచరణను వివరించారు. విశాఖ శ్రేయస్సు కోరే వైఎస్సార్‌సీపీని గెలిపించి, నగర అభివృద్ధికి సహకరించాలని కె.కె.రాజు, వరుదు కళ్యాణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆమె ఇంకా ఏమన్నారంటే...

విశాఖను వేధిస్తున్న తాగునీటి సమస్య:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారి ఆశీస్సులతో విశాఖపట్నం మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాను. విశాఖ ప్రజల సమస్యలపై నాకు పూర్తి అవగాహన ఉంది. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చాం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలపై పోరాడుతున్నాం. విశాఖలో తాగునీటి సమస్య, నిరుద్యోగ యువత ఇబ్బందులు, భూముల పరిరక్షణ, పర్యావరణ విధ్వంసం వంటి అంశాలపై నిరంతరం ప్రజల పక్షాన నిలిచాం. ఈ ఎన్నికలు కేవలం మేయర్ పదవికి సంబంధించినవి కావు. విశాఖ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, నగర భవిష్యత్తు, ప్రజా ఆస్తుల పరిరక్షణకు సంబంధించిన ఎన్నికలు. ఒక బీసీ మహిళగా, మీ ఇంటి ఆడబిడ్డగా విశాఖ ప్రజలకు సేవ చేయాలన్నదే నా ఆకాంక్ష. ప్రజలు మాపై నమ్మకంతో బాధ్యత అప్పగిస్తే పారదర్శకమైన, అవినీతి రహిత పాలన అందించేందుకు కృషి చేస్తాను.

హామీల అమలుపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తాం:

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చింది. మహిళలకు ఏడాదికి రూ. 18 వేల చొప్పున ఆడబిడ్డ నిధి ఇస్తామని చెప్పారు. మా లెక్క ప్రకారం మూడేళ్లకు రూ. 54 వేలు ఇవ్వాల్సి ఉంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు నెలకు రూ. 4 వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. మూడేళ్లకు ఒక్కొక్కరికి రూ. 1.44 లక్షలు ఇవ్వాల్సి ఉంటుంది. నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ఈ హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలి. విశాఖ ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మళ్లీ ఓట్లు అడగడం ఎలా సాధ్యమవుతుంది? ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యత.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి:

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీ అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. స్టీల్ ప్లాంట్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబాల భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొనకుండా చర్యలు తీసుకోవాలి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేశాం. కేంద్రానికి వినతిపత్రాలు అందించాం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలన్న డిమాండ్‌పై వైఎస్సార్‌సీపీ తన వైఖరిని స్పష్టంగా ప్రకటించింది. ఇప్పుడు కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తున్న కూటమి నేతలు ప్రైవేటీకరణను ఆపేందుకు ఏ చర్యలు తీసుకున్నారో ప్రజలకు వివరించాలి. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ విషయంలో కార్మికుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా ఉండాలి.

అప్రమత్తతో గండం నుంచి

బయటపడదాం : అచ్చెన్నాయుడు

ఒకటి తరువాయి

సోమవారం అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, మరుసటి రోజు అక్టోబర్ 27న అతి తీవ్ర తుపానుగా మారనుందని తెలిపారు. అక్టోబర్ 28, బుధవారం ఉదయం బాపట్ల–విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం

ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణరక్షణకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలు తక్షణమే అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. ప్రతి ఒక్కరూ అత్యవసర మందులు, తాగునీరు, ఆహార పొట్లాలు, టార్చ్‌లైట్లు, బ్యాటరీలు, ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. బలహీనమైన భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులకు దూరంగా ఉండాలని, వర్షాలు, పిడుగుల సమయంలో బయటకు రావద్దని హెచ్చరించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే వెళ్లినవారు వెంటనే తీరానికి చేరుకోవాలని ఆదేశించారు.

రైతన్నలకు ప్రత్యేక సూచనలు

రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలను వాతావరణం అనుకూలించగానే కోసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ధాన్యం రాశులు, ఇతర ఉత్పత్తులను టార్పాలిన్లతో కప్పి భద్రపరచుకోవాలన్నారు. అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు ఊతంగా కర్రలు ఏర్పాటు చేసుకోవాలని, పొలాల్లో నీరు నిలిచిపోకుండా మురుగు కాలువలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలను ఎత్తైన, సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలన్నారు. అయితే, పంటలను కాపాడే ప్రయత్నంలో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను పణంగా పెట్టవద్దని ఆయన గట్టిగా కోరారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారుల సలహాలను పాటిస్తూ ఈ విపత్తును ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలు : షర్మిల

ఒకటి తరువాయి

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని తీవ్రంగా విమర్శించారు. షర్మిల తన ప్రకటనలో, "రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను 'కూటమి కమిషన్'గా మార్చారు. నడిరోడ్డుపై రాజ్యాంగాన్ని ఖూనీ చేసి, పోలీసు వ్యవస్థను బానిసగా మార్చి, ప్రతిపక్ష అభ్యర్థుల పత్రాలు చించివేసి, వారిని భయభ్రాంతులకు గురిచేశారు. రక్తపాతంతో ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన ఘనత కూటమి పార్టీలది" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 16 మున్సిపాలిటీలు, 639 వార్డులు, 4 జెడ్పీటీసీలు, 32 ఎంపీటీసీ స్థానాల్లో జరిగినవి ఏకగ్రీవాలు కాదని, కూటమి సృష్టించిన భయోత్పాతానికి నిదర్శనాలని ఆమె అన్నారు. ఇది ప్రభంజనం కాదని, కూటమి రాజకీయ నిస్తేజమని అభివర్ణించారు. గత వైసీపీ ప్రభుత్వంతో పోలుస్తూ షర్మిల, కూటమి ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. "ఆనాడు వైసీపీ చేసిందని నేడు మీరు చేస్తారా? వాళ్లు గడ్డి తిన్నారని, మీరు అదే తింటారా? కూటమి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదా? బలవంతపు ఏకగ్రీవాల పేరుతో ఈ విచక్షణా రాహిత్యం ఎందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ బలవంతపు ఏకగ్రీవాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన షర్మిల డిమాండ్ చేశారు. ఏకగ్రీవాల ఫలితాలను నిలిపివేసి, పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజల హక్కులను కాపాడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుతానికి ఇరాన్‌పై దాడి లేదు

ఒకటి తరువాయి

ముగింపు పలకాలా? అనే అంశంపై ఇంకా ఎటువంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. దీంతో యుద్ధ మేఘాలు ప్రస్తుతానికి కొంతమేర తొలగినప్పటికీ, అటు దౌత్యపరమైన, ఇటు సైనికపరమైన అవకాశాలు రెండూ అందుబాటులోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష చర్చలు నిలిచిపోయినప్పటికీ, ఖతార్, పాకిస్థాన్ వంటి దేశాల మధ్యవర్తిత్వంతో దౌత్యపరమైన సంప్రదింపులు సాగుతున్నట్లు ఇరాన్ వర్గాలు వెల్లడించాయి. అయితే, అమెరికా విధించిన షరతులను ఇరాన్ తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలను చల్లార్చేందుకు ఖతార్, పాకిస్థాన్ ప్రతినిధులు ఇరాన్‌లో పర్యటిస్తున్నారు. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద ప్రస్తుతం తీవ్ర ఉద్విగ్న పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా తన నౌకాదళ దిగ్బంధాన్ని ఎత్తివేస్తే, జలసంధిని తిరిగి తెరిచేందుకు తాము సిద్ధమని ఇరాన్ రాయబారి సంకేతాలు పంపినట్లు సమాచారం. అయితే, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌కు అనుబంధంగా ఉన్న మీడియా ఈ వార్తలను ఖండించింది. వెరసి, ఆ ప్రాంతంలో అనిశ్చితి కొనసాగుతూనే ఉంది.

ఇలాగైతే ప్రజల మద్దతు పొందలేరు

ఒకటి తరువాయి

వైసీపీ శ్రేణులు చేసిన దాడులే ఇందుకు నిదర్శనమని అనగాని పేర్కొన్నారు. ఎన్నికలు ఏవైనా హింసను ప్రోత్సహించడమే జగన్ నైజమని, గత ఐదేళ్ల పాలనను చూసి ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా ఆయన తీరులో ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. కుట్రలు, దాడులు, విధ్వంసాలతో ప్రజల ఓట్లు సాధించలేరనే వాస్తవాన్ని జగన్ గుర్తించాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని మంత్రి తెలిపారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఛాంపియన్ కూటమి విజయ దుందుభి మోగిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. "స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు చూసైనా గొడ్డలి పార్టీ నాయకులకు, జగన్ రెడ్డికి బుద్ధి రావాలి. ఇక ఆ పార్టీ దుకాణం సర్దేసుకోవడం మంచిది" అని అనగాని సత్యప్రసాద్ తన ప్రకటనలో వ్యాఖ్యానించారు.

ఈ85, ఈ100 ఇంధనాలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్!

ఒకటి తరువాయి

మామూలు లేదా జు20 వాహనాల పరిస్థితి ఏంటని టెన్షన్ పడుతున్న వాహనదారులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. ప్రస్తుత ఈ20 ఇంధనానికి అనుకూలంగా ఉన్న వాహనాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ తేల్చిచెప్పింది. జు20 కార్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ85 లేదా ఈ100 ఇంధనాలను వాడలేవని, కాబట్టి ఇప్పటికే రోడ్లపై తిరుగుతున్న వాహనాల యజమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. వాహనాల్లో ఎలాంటి మార్పులు చేయించుకోవాల్సిన పనిలేదని క్లారిటీ ఇచ్చింది. బ్రెజిల్, అమెరికా వంటి దేశాల్లో ఇప్పటికే ఈ ఫ్లెక్స్-ఫ్యూయల్ టెక్నాలజీ చాలా పాపులర్. ఇవి పెట్రోల్‌తో పాటు వివిధ శాతాల్లో ఇథనాల్‌ను మిక్స్ చేసి నడిచే అడ్వాన్స్‌డ్ ఇంజిన్‌లను కలిగి ఉంటాయి. ఇందులో జు85 అంటే 85 శాతం ఇథనాల్ ఉండగా, ఈ100 అంటే పూర్తిగా స్వచ్ఛమైన ఇథనాల్ ఇంధనం అన్నమాట. సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్ వల్ల వాతావరణానికి చాలా తక్కువ కాలుష్యం కలుగుతుంది. ఈ ఇంధనాల వాడకం వల్ల గాలిలో కలిసే హానికరమైన కార్బన్ మోనాక్సైడ్, ఇతర మురికి వాయువులను చాలా వరకు తగ్గించవచ్చు. అంతకంటే ముఖ్యంగా, విదేశాల నుంచి కోట్లు వెచ్చించి దిగుమతి చేసుకునే ముడి చమురుమీద మన దేశం ఆధారపడటాన్ని ఇది భారీగా తగ్గిస్తుంది. దేశాన్ని స్వయంసమృద్ధి వైపు, కాలుష్య రహిత భవిష్యత్తు వైపు తీసుకెళ్లే దిశగా కేంద్రం వేసిన ఈ అడుగు దేశ ఆర్థిక వ్యవస్థకూ ఎంతో మేలు చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

విజయవాడకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

ఒకటి తరువాయి

అనంతరం మంత్రి నారా లోకేశ్ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను శాలువాతో సత్కరించి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక ప్రత్యేక జ్ఞాపికను బహూ కరించారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదిక లో జరగనున్న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవ (రూబీ జూబ్లీ) వేడుకల్లో ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన మధ్యాహ్నం తిరుపతికి బయలుదేరి వెళ్లనున్నారు.

30 సెకన్లలో నిరసన ఆపేస్తాం : రాహుల్

ఒకటి తరువాయి

నేపథ్యంలో సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. అయితే, నవంబర్ 8న దీపావళి, 6న ధన్‌తేరస్ ఉన్నందున, పండుగ సీజన్‌లో ఈ ఆందోళన నిర్వహిస్తే వ్యాపార కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల దాదాపు రూ.10,000 కోట్ల మేర నష్టం వాటిల్లుతుందని, కాబట్టి నవంబర్ 10 తర్వాత నిరసన చేపట్టాలని కోరుతూ రాహుల్ గాంధీకి లేఖ రాసింది. వ్యాపారుల అభ్యర్థనను రాహుల్ గాంధీ తోసిపుచ్చారు.

ఈ విషయంపై ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రభుత్వం మెట్రోను మూసివేసి, రోడ్లకు సీల్ వేసి, రాజధానిని లాక్‌డౌన్ చేసిందని, దొంగిలించబడిన ఓటుతో ఏదీ సురక్షితం కాదని విమర్శించారు. అనంతరం వ్యాపారులతో మాట్లాడుతూ, "నిందితుడు నంబర్ 4 అయిన జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించమని మోదీకి చెప్పండి. 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయి" అని తేల్చిచెప్పారు. కేవలం ధన్‌తేరస్ రోజునే ఢిల్లీ మార్కెట్లలో సుమారు రూ.25,000 కోట్ల టర్నోవర్ జరుగుతుందని అంచనా. ఇంతటి కీలక సమయంలో ఆందోళన చేపట్టడంపై వ్యాపార వర్గాలు ఆందోళన చెందుతున్నప్పటికీ, సీఈసీ రాజీనామా విషయంలో వెనక్కి తగ్గేది లేదని విపక్షాలు స్పష్టం చేస్తున్నాయి.

ఎన్టీఆర్ దూరదృష్టి

ప్రశంసనీయం : ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

విజయవాడ , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : భవిష్యత్తులో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వర్సిటీ 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యా, వైద్య, సంక్షేమ, సాంస్కృతిక రంగాలతో పాటు తెలుగు భాషాభివృద్ధికి దివంగత ఎన్టీ రామారావు అందించిన సేవలను ఆయన కొనియాడారు. దేశంలోనే తొలి హెల్త్ యూనివర్సిటీని స్థాపించడంలో ఎన్టీఆర్ చూపిన దూరదృష్టి ప్రశంసనీయమని అన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా చెన్నైకి తాగునీరు అందించిన ఆయన మానవతా దృక్పథాన్ని గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో వికసిత భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలు, సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని రాధాకృష్ణన్ తెలిపారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కొత్త పరిష్కారాలు కనుగొనేందుకు వర్సిటీ విద్యార్థులు అంతర్జాతీయ పరిశోధనల్లో రాణించాలని



సూచించారు. వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీల ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ, వైద్యులు మానవత్వాన్ని ఎన్నడూ మరువరాదని ఆయన హితవు పలికారు. రోగుల పట్ల కరుణ, మానవత్వం, ఆత్మీయత చూపడమే వైద్య వృత్తిలో అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. సమాజంలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, దాని దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు వైద్యులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఏబీ వెంకటేశ్వరరావుపై వ్యక్తిగత విమర్శలు చేయను : వంగవీటి రాధా

విజయవాడ , అక్టోబర్ 26 (గ్లోబల్ వార్త) : విజయవాడ నగర అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణే తన ప్రధాన లక్ష్యాలని కూటమి మేయర్ అభ్యర్థి వంగవీటి రాధా స్పష్టం చేశారు. నగరంలో ఏ ఒక్క కుటుంబం కూడా ఇబ్బంది పడకుండా ప్రశాంత వాతావరణం కల్పిస్తామన్నారు. రాజకీయ ప్రత్యర్థి అయిన ఏబీ వెంకటేశ్వరరావు అనుభవాన్ని గౌరవిస్తానని, నగరాభివృద్ధికి ఆయన ఇచ్చే మంచి సూచనలు తప్పక స్వీకరిస్తానని తెలిపారు. నెరవేర్చలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయబోనని, విశ్వసనీయతకే కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. మరోవైపు, ఏబీ వెంకటేశ్వరరావు కూడా రాధాతో తనకు 20 ఏళ్ల పరిచయం ఉందని, ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేయబోనని ప్రకటించారు. తమ మధ్య పోటీ రాజకీయపరమైనదే కానీ, వ్యక్తిగతం కాదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య జరిగిన ఆత్మీయ పలకరింపు.. ఎన్నికల వాతావరణంలో హుందాతనాన్ని నింపింది.

ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు : సీఎం

ఒకటి తరువాయి

తీవ్ర తుపానుగా, 27న అతి తీవ్ర తుపానుగా బలపడనుంది. అక్టోబర్ 28వ తేదీ ఉదయం బాపట్ల--విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, అందువల్ల ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.

రేపు, ఎల్లుండి అతి భారీ వర్షాలు.. గంట గంటకూ పరిస్థితి సమీక్షిస్తోన్న చంద్రబాబు

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గంట గంటకూ పరిస్థితిని సమీక్షిస్తూ, రాష్ట్ర యంత్రాంగాన్ని సర్వసన్నద్ధం చేస్తున్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించడమే లక్ష్యంగా ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు, ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వర్చువల్‌గా సమీక్షలు నిర్వహిస్తున్నారు. తుపాను గమనాన్ని, ప్రభుత్వ చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కీలక ఆదేశాలు జారీ చేస్తున్నారు. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరికల ప్రకారం, అర్ణబ్ తుపాను రేపటికల్లా తీవ్ర తుపానుగా బలపడి రాష్ట్రంపై ప్రభావం చూపనుంది. ఈ నెల 28వ తేదీన బాపట్ల–విశాఖ మధ్య యానాం వద్ద ఇది తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుపాను ప్రభావంతో రేపు మధ్యాహ్నం నుంచి ఉత్తర కోస్తాంధ్ర, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పలనాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కూడా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం తీసుకుంటున్న చర్యలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపు, సహాయక చర్యలు

తుఫాన్ నేపథ్యంలో ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు (షెల్టర్లకు) తరలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, దివ్యాంగులు, బాలింతలు, చిన్నారులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 4,711 మంది గర్భిణీలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రభావిత జిల్లాల్లో వైద్య బృందాలను, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సహాయక చర్యల కోసం రాష్ట్రంలో 7 ఎన్డీఆర్ఎఫ్, 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను 11 జిల్లాల్లో మోహరించాలని, అదనపు బలగాలను ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల్లో రిజర్వ్‌లో ఉంచాలని ఆదేశించారు. మెరైన్ పోలీసులు, నౌకాదళం, కోస్ట్‌గార్డ్ సేవలను కూడా వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

వ్యవసాయం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

తుపాను వల్ల పంట నష్టం జరగకుండా చూడాలని, ఇప్పటికే కోత కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా రైతులకు సహకరించాలని వ్యవసాయ శాఖకు సీఎం సూచించారు. రాష్ట్రంలో సుమారు 1.82 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించేందుకు సిబ్బందిని, సామగ్రిని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు నిత్యావసరాలు, రేషన్ సరకులు అందుబాటులో ఉంచాలన్నారు. తుపాను గమనాన్ని బట్టి ప్రతి నాలుగు గంటలకూ ప్రజలకు హెచ్చరికలతో కూడిన బులెటిన్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు. గత తుపానుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరింత పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. తుపాను తీవ్రతను బట్టి ప్రభావిత ప్రాంతాల్లోని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే అధికారాన్ని కలెక్టర్లకు అప్పగించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 40వ వార్షికోత్సవం.. సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవం (రూబీ జూబ్లీ) సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రత్యేక సందర్భంలో విద్యార్థులు, అధ్యాపకులు, వైద్యులు, పరిశోధకులు, సిబ్బందికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. దివంగత ఎన్టీ రామారావు గారి సంకల్పంతో ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం నాలుగు దశాబ్దాలుగా వైద్య విద్య, పరిశోధన, ప్రజారోగ్య రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. నాణ్యమైన విద్య ద్వారా సమాజానికి నిబద్ధత కలిగిన వైద్యులను అందించడం గర్వకారణమని అన్నారు. "వైద్యం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు, ప్రాణాలను కాపాడే పవిత్రమైన బాధ్యత. సాంకేతికత వైద్యానికి శక్తిని ఇస్తే, మానవత్వం దానికి మరింత విలువను చేకూరుస్తుంది" అని ముఖ్యమంత్రి తన సందేశంలో పేర్కొన్నారు. 40 ఏళ్ల వైద్య సేవా స్ఫూర్తితో ఈ విశ్వవిద్యాలయం భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

మిత్రధర్మం పాటించాల్సిందే.. టీడీపీ ముఖ్య నేతలకు చంద్రబాబు కీలక ఆదేశాలు

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పార్టీ ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని, ప్రతిఒక్కరూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. 'చెప్పాం–చేస్తున్నాం' అనే నినాదంతో ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో మిత్రధర్మాన్ని తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 సార్వత్రిక ఎన్నికల్లో అద్భుత విజయం తర్వాత మనం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం. 151 సీట్లతో గెలిచి అరాచకాలు సృష్టించిన గొడ్డలి పార్టీని ప్రజలు కేవలం 11 సీట్లకే పరిమితం చేసి తిరుగుబాటు చేశారు. ఇప్పుడు మనం అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాం. ప్రభుత్వ సేవలను సులభతరం చేస్తూ సుపరిపాలన అందిస్తున్నాం. ఈ మంచి పనులను ప్రజలకు వివరించాలి" అని అన్నారు.

మిత్రధర్మం పాటించాల్సిందే..

కూటమి పార్టీల మధ్య క్షేత్రస్థాయిలో చక్కటి సమన్వయం ఉండాలని చంద్రబాబు గట్టిగా సూచించారు. "కూటమిలోని మూడు పార్టీల కార్యకర్తలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా నిలవాలి. మిత్రధర్మాన్ని పాటించడంలో ఎలాంటి వెసులుబాటు ఉండదు. మూడు స్థాయిల్లోనూ (కేంద్ర, రాష్ట్ర, స్థానిక) ఒకే ప్రభుత్వం ఉంటే జరిగే అభివృద్ధిని ప్రజలకు వివరించాలి. వార్డు, డివిజన్ మొదలు ప్రతి స్థానంలోనూ కూటమి జెండాలు ఎగరాలి" అని ఆయన స్పష్టం చేశారు.

కష్టపడ్డవారికి గుర్తింపు.. నామినేటెడ్ పదవులు

పొత్తులు, రిజర్వేషన్లు, సామాజిక సమీకరణాల కారణంగా కొంతమంది నేతలకు స్థానిక ఎన్నికల్లో అవకాశాలు దక్కకపోవచ్చని చంద్రబాబు అంగీకరించారు. "పార్టీ కోసం, రాష్ట్రం కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుంది. అలాంటి వారికి నామినేటెడ్ పదవులతో గౌరవిస్తాం. పాలనలో తాము కూడా భాగస్వాములమనే సంతృప్తి ప్రతి వర్గానికి కలగాలి. అందుకే బీసీలకు, చిన్న కులాలకు కూడా ఈ ఎన్నికల్లో ప్రాధాన్యత ఇచ్చాం" అని భరోసా ఇచ్చారు. అగ్ర నేతల నుంచి కార్యకర్తల వరకు అందరి పనితీరును రికార్డ్ చేస్తున్నామని తెలిపారు.

గొడ్డలి పార్టీపై ప్రజలను అప్రమత్తం చేయాలి

ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరిస్తూనే, ప్రతిపక్షం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "గొడ్డలి పార్టీ వల్ల రాష్ట్రానికి జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించాలి. ఆ పార్టీ అధ్యక్షుడు తన స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఎలా తాకట్టు పెడతాడో, కుటుంబ బంధాలను కూడా ఎలా పట్టించుకోడో ప్రజలకు తెలియజేయాలి. ప్రతి ఓటరు పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసేలా చూడాలి. 2024 ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు ప్రతి బూత్‌లోనూ పడాలి" అని ఆయన లక్ష్య నిర్దేశం చేశారు.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA,
ARUNODAYA OFFSET PRINTERS"#33-5-9, PAPAIAH STREET, SEETHARAMPURAM, VIJAYAWADA"PH: 0866-2431422, 9346504777
"E-MAIL: ARUNODAYAVJW@GMAIL.COM . EDITOR DONDLAVAGU BHAVYA. 08562-461571 APTEL/2026/A2902